Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 304 పేజీలు 8 వెల : 5 బుధవారం 06 మే 2026

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉత్తేజిత దినపత్రికకు మరియు UV9 కేబుల్ Tv చానల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను

ఉత్తేజిత దినపత్రిక UV9

Contact : 94401 40418, 63038 17489

కాళేశ్వరం అవినీతిపై చర్యలేవీ

కెసిఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ము లేదా

కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు

2లో..

రూ.5.11 లక్షల కోట్ల నాబార్డు రుణ ప్రణాళిక

అమరావతి: నాబార్డు 2026-27 సంవత్సరానికి గాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో రూపొందించిన నాబార్డు క్రెడిట్ ప్లాన్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. రుణ ప్రణాళిక గతేడాది రూ.4.24 లక్షల కోట్లు ఉండగా... ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాధమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు,ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్‌కు రూ.11,961 కోట్లు కేటాయించింది. హార్టికల్చర్‌లో రాయల సీమ, ప్రకాశం జిల్లాలకు రూ.5,313 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. అలాగే ఎంఎస్ఎంఈ లకు రూ.1.64 లక్షల కోట్లు చొప్పున కేటాయించింది.

ఆదాయం దక్కేలా ఇనుప ఖనిజ వినియోగం

అమరావతి: రాష్ట్రానికి ఆదాయం, యువతకు ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రంలోని ఇనుప ఖనిజ నిక్షేపాలను వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా సంస్థ 17.8 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నక్కపల్లి వద్ద ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తుండగా, జేఎస్‌డబ్ల్యు సంస్థ రాయలసీమలో భారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇనుప ఖనిజం లభ్యత అద్భుత అవకాశం అని తెలిపారు.

2లో..

పాస్టర్లకు ఎస్సీ కుల ధృవీకరణ

హైకోర్టులో విచారణ..జూలై 6కు విచారణ వాయిదా

2లో..

హైదరాబాద్‌లో హైడ్రా భారీ కూల్చివేత

ఆరుచోట్ల అక్రమ మైనింగ్ ప్లాంట్లపై

9 రాష్ట్రాల్లో ఆపరేషన్ ఆక్టోపస్

సైబర్ క్రైమ్ పోలీసుల దాడులు

56 మంది నిందితుల అరెస్ట్

ఇక అరెస్టయిన వారిలో 17 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వారని పోలీసులు వివరించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 30 మంది, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

2లో..

2లో..

మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

నేటిలోగా సమాధానం

రాకపోతే ఆందోళన తీవ్రం

ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్

హైదరాబాద్‌లో బీఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

2లో..

ప్రధాని పర్యటనలో భారీ భద్రత

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

అధికారులతో సమీక్షలో సిఎస్ ఆదేశం

హైదరాబాద్‌లో బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

హైదరాబాద్: హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు సంస్థ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. ఈ హబ్ ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్ సేవలకు వ్యూహాత్మక కేంద్రంగా పని చేయనుంది. గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్‌వర్క్‌కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది. తెలంగాణలో మరో మెగా గ్లోబల్ కంపెనీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపై ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌పై అంతర్జాతీయ కంపెనీల నమ్మకం మరింత పెరుగుతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ ల సమక్షంలో బిఎఎస్ ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్ కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేసారు. సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఊ ఏడాది 100 జిసిసిల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. వీటి ద్వారా లక్ష మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేధస్సు ఆధారిత కేంద్రం ఐకామ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధన్ సంస్థ '1 బయోల్యాబ్' లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 160 సంవత్సరాల చరిత్ర కలిగిన బిఎఎస్ ఎఫ్ ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 234 కర్మాగారాలు, 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తున్న ఈ సంస్థ వార్షిక ఆదాయం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు (60 బిలియన్ డాలర్లు). ప్రపంచంలోని పలు నగరాలతో పోటీ పడి హైదరాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక అవకాశాన్ని దక్కించుకోవడం రాష్ట్రానికి దక్కిన గౌరవం. న్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్ లాంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ జిసిసిలు ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయని శ్రీధర్ బాబు తెలిపారు.

ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

రాజన్నసిరిసిల్ల: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాట్మ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ÷-లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల

వైపు రైతులు దృష్టి సారించిన ప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (ఓ÷ూఖ) కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు పక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

పాస్టర్లకు ఎస్సీ కుల ధృవీకరణ

హైకోర్టులో విచారణ..జూలై 6కు విచారణ వాయిదా

అమరావతి: సరైన విచారణ జరపకుండా పాస్టర్లకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అనంతరం జులై 6వ తేదీకి ఈ కేసు విచారణను వాయిదా వేసింది. చర్చిల్లోని పాస్టర్లకు జారీ చేసిన ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని హైకోర్టులో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దిరెడ్డి ప్రసన్న కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. పాస్టర్లకు జారీ చేసిన ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్లకు ప్రసన్న కుమార్ పలుమార్లు వినతి పత్రాలు సమర్పించారు. అయినా వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పిటిషన్‌లో ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. దీనిపై ఈ రోజు విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. జులై ఆరో తేదీకి ఈ కేసును వాయిదా వేసింది.

మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

జనగామ: రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై

తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో

జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

ప్రధాని పర్యటనలో భారీ భద్రత

హైదరాబాద్: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, ఉఊఓఅ, రోడ్లూ భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి,్గ÷ర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం అవినీతిపై చర్యలేవీ

కరీంనగర్: సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము రేవంత్ రెడ్డికి లేదా అని ప్రశ్నించారు.

మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై రేవంత్ మళ్లీ వెనకడుగు వేస్తున్నారని విమర్శించారు. 'కేసీఆర్‌తో బేరం కుదరలేదా. ఢిల్లీకి మూటలు సరిగా ముట్టడం లేదా. అన్ని కేసులను సీబీఐకి ఎందుకు అప్పగిస్తారు' అంటూ మండిపడ్డారు. రైతులు ఏడుస్తున్నారని.. వారి విషయంలో ప్రభుత్వానికి మానవత్వం లేదని కేంద్ర మంత్రి విరుచుకుపడ్డారు. ఎంతమంది చనిపోతే రేవంత్ రెడ్డి కళ్లు చల్లబడతాయంటూ వ్యాఖ్యానించారు. కొనుగోళ్లు వెంటనే జరపాలని.. కోత పెడితే ఊరుకోమని హెచ్చరించారు. ప్రధాని మోదీ వస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. మోదీని చూసి రేవంత్ రెడ్డి భయపడుతున్నారంటూ బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

దేశాభివృద్ధికి కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ:దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ ఇవాళ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ. 1 లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది. టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ. 868 కోట్లు మంజూరు చేశారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ - వాడి లైన్ నిర్మాణానికి రూ. 4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్హ్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ. 2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. దీంతోపాటు, సుప్రీంకోర్టులో మరో నలుగురు న్యాయమూర్తులను పెంచడానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో దేశ అత్యున్నత న్యాయస్థానంలో

జడ్జిల సంఖ్య 33 నుంచి 37కు చేరుతుంది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

9 రాష్ట్రాల్లో ఆపరేషన్ ఆక్టోపస్

హైదరాబాద్:హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆపరేషన్ ఆక్టోపస్ 2.0తో పేరుతో భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించి.. 56 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బ్యాంక్ సిబ్బందితోపాటు పట్టుబడ్డ నిందితులకు 101 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అలాగే అరెస్ట్ అయిన వారిలో 32 మంది బ్యాంక్ మేనేజర్లు, కేవైసీ అప్రూవర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్లతోపాటు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు. అదే విధంగా15 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లతో పాటు, 9 మంది అకౌంట్ ఆపరేటర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరికీ 101 కేసులతో సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధితులకు రూ. 69.99 లక్షలు రీఫండ్ చేశారు. ఈ 101 కేసుల్లో బాధితుల నుంచి రూ. 9.13 కోట్ల నగదును నిందితులు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇక అరెస్టయిన వారిలో 17 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వారని పోలీసులు వివరించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 30 మంది, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇలా అరెస్టయిన వారిలో తెలంగాణ నుండి అత్యధికంగా 17 మంది ఉన్నారని తెలిపారు. మహారాష్ట్ర నుంచి 14, ఢిల్లీ నుంచి 9, కర్ణాటక నుంచి నలుగురు, ఏపీ నుంచి ఇద్దరు అరెస్టయ్యారని పేర్కొన్నారు. నిందితుల నుంచి 34 మొబైల్ ఫోన్లు, 8 చెక్ బుక్కులతోపాటు 11 షెల్ కంపెనీ స్టాంపులు, ట్యాబ్ సీజ్ చేశామని వివరించారు. సైబర్ పెట్రోలింగ్ ద్వారా అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న 184 సోషల్ మీడియా ప్ర్గా÷ళు తొలగించినట్లు పోలీసులు చెప్పారు. సి-మిత్ర ద్వారా1250 కాల్స్ చేసి బాధితులకు అవగాహన కల్పించడంతో పాటు 194 జీరో ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. గేమింగ్ ఫ్రాడ్ కేసులో బాధితురాలిని మోసం చేసి రూ. 74.99 లక్షలు మోసం చేసిన కేసులో కోల్‌కతాకు చెందిన ఇండస్ఇండ్ బ్యాంక్ కీ అకౌంట్ మేనేజర్ మొహమ్మద్ రియాజుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ మనీష్ ప్రసాద్ విశ్వకర్మను అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు.

చురుకుగా రబీ ధాన్యం సేకరణ

నల్లగొండ: రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. అన్‌లోడింగ్ తోపాటు, వెహికల్ రోటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం,లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు,టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సప్లై కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రపరిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల వివరాలను, టార్పాలిన్లను అడిగారు. అవసరమైతే ఎక్స్ట్రా టార్పాలిన్లు కొనుగోలు కేంద్రాలలో పెట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్దార్థ రైస్ ఇండస్ట్రీస్ ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని అడగగా 35 మంది ఉన్నారని తెలిపారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి - సీఐటీయు

ఆత్మకూరు ఉత్తేజిత

కొత్తపల్లి: ఆశా లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, అన్ని రకాల సెలవులు, మట్టి ఖర్చులు ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో కొత్తపల్లి, గోకవరం పీహెచ్సీల ముందు నిరసన తెలియజేసి మెడికల్ ఆఫీసర్ లకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరి లలితమ్మ జయమ్మ మాట్లాడుతూ ఆశాలకు పని భారాన్ని తగ్గించాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని కాళీ పోస్టులు భర్తీ చేయాలని పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఆశాల సంఖ్యను పెంచాలన్నారు. మాత శిశు సంరక్షణ పేరుతో నియమింపబడిన ఆశ వర్కర్స్ తో ప్రభుత్వము ఎల్లవెల్లాల పనులు చేయిస్తున్నది గర్భవతులు బాలింతలు పసిపిల్లల ఆరోగ్య సంరక్షణకు మోటివేట్ చేస్తే చాలు అనే పేరుతో నియమించి అన్ని రకాలైన పనులు ఊపిరి సలపకుండా చేస్తున్నారు. సర్వేల పేరుతో పని భారాన్ని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఆశాలకు సంబంధం లేని సిబ్బంది చేయాల్సిన పనులు సైతం బలవంతంగా బెదిరించి చేస్తున్నారు. పండగలు తుఫానులు వరదలు, పరీక్షలు ఎన్నికల సందర్భంగా కూడా టీఏడీఏలు చెల్లించకుండా పనిచేయిస్తున్నారు. 20 ఏళ్లుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించడం లేదు కార్మికులుగా గుర్తించడం లేదు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు జరపడం లేదు అనారోగ్యం పాలైన కుటుంబంలో ఎవరికైనా సుస్థి చేసినా సెలవులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఆశ వర్కర్ల సంఖ్యను పెంచకుండా 2000 నుండి 5వేల జనాభా వరకు చాకిరి చేస్తున్నారు. సెలవు కావాలంటే అధికారుల దయ దక్షిణాల మీద ఆధారపడాల్సి వస్తుందన్నారు. పేద ప్రజలకు నిరంతరం సేవలందించే ఆశాల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆశా కార్యకర్తలకు గ్రూప్ ఇన్సూరెన్స్ 10 లక్షలు ఇవ్వాలని, కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలి, ఆశల రిక్రూట్మెంట్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి పని భారాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి ప్రవీణ సుజాత శాంతకుమారి సుబ్బమ్మ శేషమ్మ సరోజ జయమ్మ , తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్లలో బిజెపి నాయకులు సంబరాలు

బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి

: బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ బిజెపి నాయకులు నిన్న వెలబడిన పశ్చిమబెంగాల్,అస్సాం, పుదుచ్చేరి,రాష్ట్రాలలో బిజెపి ఎన్నికల విజయాన్ని సాధించడంతో బిజెపి జిల్లా కార్యదర్శిలు నాగ మోహన్,అంబాటి సుబ్బారెడ్డి,లు మంగళవారం బేతంచెర్లలో బానసంచ పేల్చి కేకు కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ రానున్న రోజులలో ఏపీ,తెలంగాణ,స్థానిక ఎన్నికలలోనూ తమ పార్టీని ఆదరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్ బాబు, ఉపేంద్ర,జీవన్ చౌదరి,అరుణ్,వసంత్, కన్యాకుమారి,మైనార్టీ మోర్చా షేక్ నూర్ అహ్మద్,తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి బిజెపి మండల ఇన్చార్జిగా జిల్లా కార్యదర్శి అంబాటి సుబ్బారెడ్డి

బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి :

ప్యాపిలి మండలం భారతీయ జనతా పార్టీ ఇన్చార్జిగా జిల్లా కార్యదర్శి బేతం చెర్ల మండలానికి చెందిన అంబాటి సుబ్బారెడ్డి,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మేరకు జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు,జిల్లా కార్యదర్శి నాగమోహన్,వివరాలు వెల్లడించారు.అంబాటి సుబ్బారెడ్డి,పార్టీకి చేసిన సేవలను గుర్తించి అధిష్టానం ఈ పదవిని అప్పగించినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా మండల నాయకులు,కార్యకర్తలు అంబాటి సుబ్బారెడ్డిని శాలువాతోఘనంగా సన్మానించారు.ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు రమేష్ బాబు, ఉపేంద్ర,జీవన్ చౌదరి,మనోహర్,వసంత్,అరుణ్, కన్యాకుమారి,సీనియర్ అడ్వకేట్ నంది పల్లె నారాయణ,మైనార్టీ మోర్చా షేక్ నూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తాసిల్దార్ కి వినతి పత్రం - సిపిఐ

బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి

: రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుతో బేతంచెర్ల తాసిల్దార్ కార్యాలయం ఎదుట మండల కార్యదర్శి భార్గవ్,ఆధ్వర్యంలోనిరసన వ్యక్తం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా12.50 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారని ధర లేక రైతులు నష్టపోతున్నారని అన్నారు.ప్రభుత్వం క్వింట రూ 2400తో కొనుగోలు చేయాలని తాసిల్దార్ నాగమణి,కి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్,ప్రదీప్,ఉదయ్,రాముడు, ధనుంజయ,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చెరువు ఆధారం

నీటి సంరక్షణ పనులతో భూగర్భ జలాల పెంపే లక్ష్యం

జలధార పనులతో ఉపాధి హామీ వేతనదారులకు వరంగా మారిన వి బి జి రామ్ జి పథకం

తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజిత మే 5.

భారత దేశంలో చెరువులు కేవలం నీటి వనరులే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, మానవ మనుగడకు, సంస్కృతి పరిరక్షణకు పట్టుకొమ్మలు. ఇవి నీటి నిల్వకు మాత్రమే కాకుండా వరదల ప్రభావం తగ్గించడానికి, పర్యావరణ సమతుల్యానికి, భూగర్భ జలాల సంరక్షణకు అత్యంత కీలకమైనవి. గంగలపూడి చెరువు పునరుద్ధరణతో 150 ఎకరాల పంటలకు నీరు శ్రీకాళహస్తి మండలంలో జలధార -- జలహారతి కార్యక్రమం కింద మొత్తం 85 పనులను చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు జారీ చేశారు. అందులో 77 ఫీడర్ చానల్స్, 8 నీటి సంరక్షణ కుంటల పనులు చేపట్టనున్నారు. శ్రీకాళహస్తి మండలంలోని గంగలపూడి గ్రామ పంచాయతీలోని గంగలపూడి చెరువులో 30 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పు, 1 మీటర్ లోతుతో రూ.4 లక్షల అంచనా వ్యయంతో నీటి సంరక్షణ కుంట పనిని 75 మంది ఉపాధి హామీ వేతనదారులతో గత 2 వారాలుగా చేపడుతున్నారు. వర్షాల వలన కురిసే నీరు పల్లం చెరువు నిండి ఫీడర్ చానల్ ద్వారా గంగల పూడి చెరువుకు చేరుతుంది. ఈ చెరువు నిండడం ద్వారా 15 బోరు బావులు, 4 బావులు రీఛార్జ్ అవుతాయి. గంగలపూడి, వేలవేడు గ్రామాలకు లబ్ది చేకూరనుంది. ఈ నీటి ద్వారా 150 ఎకరాలలోని ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఆ నీటి ద్వారా వరి, వేరుశెనగ పంటలను పండించుకుంటారు. జలధార పనులతో ఉపాధి హామీ వేతనదారులకు వి బి జి రామ్ జి పథకం వరంగా మారింది.జలధార--జలహారతి తో నీటి నిల్వ, ఉపాధి హామీతో జీవనోపాధి కోట చంద్రబాబు గంగల పూడి ఉపాధి హామీ వేతనదారుడు . . మాట్లాడుతూ జలధార-జలహారతి కార్యక్రమం కింద తాము నీటి సంరక్షణ కుంట పనిని చేస్తున్నామని ఈ పని తమకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో వర్షాలు పడినప్పుడు ఆ నీరు వృధా అయ్యేదని, ఈ చెరువులో ప్రస్తుతం నీటి సంరక్షణ పనిని చేపట్టడం వలన వర్షపు నీరు చేరి నీరు నిల్వ ఉంటుందన్నారు. నిల్వ ఉంచిన నీటి ద్వారా చెరువు పరిసర ప్రాంతాల లోని బోర్లలో నీటి మట్టం పెరగడంతో పాటు త్రాగు నీటి కొరత కూడా తీరుతుందన్నారు. గతం లో 100 రోజులు ఉన్న పని దినాలను విబి జి రామ్ జి పథకం కింద 125 రోజులకు పెంచడం వలన పెంచిన రోజులకు మాకు మరింత వేతనం లభిస్తుందన్నారు. ఈ పని చేయడం ద్వారా తమకు రోజుకు రూ.300 నుండి రూ.307 వరకు వేతనం అందుతోందన్నారు. ఈ పనులు కల్పించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు.

రేణిగుంట సచివాలయానికి తాళం...

28 ఏళ్ల సేవకు దక్కిన ప్రతిఫలం ఇదేనా?...

రేణిగుంట ఉత్తేజిత మే 5.

విధి నిర్వహణలో దశాబ్దాల కాలంగా నిరుపమాన సేవలు అందిస్తున్న ఒక సామాన్య కార్మికురాలికి అధికారుల వేధింపులు శాపంగా మారాయి. తమ సమస్యలపై గళమెత్తడమే ఆమె చేసిన నేరమా అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికారుల కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ రేణిగుంటకు చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు చంద్రకళ మంగళవారం గ్రామ సచివాలయానికి తాళం వేసి తన నిరసనను వ్యక్తం చేశారు.8 నెలలుగా అందని వేతనం.. ఆకలి కేకల మధ్య కుటుంబంగత 28 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికురాలిగా సేవలందిస్తున్న చంద్రకళకు గత ఎనిమిది నెలలుగా జీతాలు అందడం లేదు. "కుటుంబ పోషణ భారమై, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాను. ఎనిమిది నెలల నుంచి జీతం రాకపోతే బతికేది ఎలా?" అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. అసలు తాను ఉద్యోగంలో ఉన్నానో లేదో కూడా అర్థం కాని పరిస్థితిని అధికారులు కల్పించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

?కక్ష సాధింపు చర్యలు.. బ్యాంక్ ఖాతాల నిలిపివేత

?చంద్రకళ ఏఐటీయూసీ సభ్యురాలిగా ఉంటూ, కార్మికుల పక్షాన నిలబడి అధికారులను ప్రశ్నిస్తుందనే నెపంతో పంచాయతీ అధికారులు ఆమెపై వేధింపులకు దిగుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

?అకౌంట్ ఫ్రీజ్: అధికారులు ఉద్దేశపూర్వకంగానే తన బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేయించారని చంద్రకళ ఆరోపించారు.వింత నిబంధనలు: తన స్వంత అకౌంట్ ఉండగా, "నీ బంధువుల అకౌంట్ ఇస్తే అందులో శాలరీ జమ చేస్తాం" అని అధికారులు చెప్పడం వెనుక ఉన్న మర్మమేమిటని ఆమె ప్రశ్నిస్తున్నారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి మొరపంచాయతీ రాజ్ శాఖా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆమె వేడుకున్నారు. "సార్.. పంచాయతీలో జరుగుతున్న అరాచకాలను, అధికారుల అక్రమాలను అరికట్టండి. మాలాంటి పారిశుద్ధ్య కార్మికులకు బాసటగా నిలవండి" అంటూ ఆమె విజ్ఞప్తి చేశారు.దశాబ్దాల కాలం ఊరిని శుభ్రం చేసిన చేతులకు నేడు ఆకలి కష్టాలు మిగిల్చిన అధికారుల తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చంద్రకళకు రావలసిన వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, వేధింపులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రజల ఆకాంక్షలను బిజెపి గౌరవించాలి !

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బిజెపి ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బిజెపి రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బిజెపి హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటుదారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్యం కాదన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవులు సద్దుమణగవు. ఒక్కొక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బిజెపి పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి.

యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు. ఇకపోతే తమిళనాటు విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు. ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కు కోగలరు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృతమనే చెప్పలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు.

భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బిజెపి ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన పాలన దిశగా బిజెపి కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావడానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోదీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతోపాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది.

రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళు ్లగా స్వేచ్ఛ లేకుండా పోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయ లో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బిజెపి గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బిజెపి పట్ల అనురాగం పెరగాలి.

రెడ్ సెల్యూట్ కారల్ మార్క్స్..!

భారత ఆధునిక సమాజ స్థాపన ' కమ్యూనిజం ' తోనే సాధ్యం!!

ప్రపంచ కార్మిక పీడత ప్రజల ఆయుధం 'మార్క్సిజం'

రేణిగుంట సుందరయ్య భవనంలో 'కారల్ మార్క్స్' 208వ జయంతి!

రేణిగుంట ఉత్తేజిత మే 5.

రేణిగుంట పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కారల్ మార్క్స్ 208వ జయంతి సందర్భంగా సీనియర్ కామ్రేడ్ వెంకటరమణ, హరినాథ్ ఆయన గురించి ఉపన్యాసం ఇచ్చారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఎం కార్యకర్తలు "రెడ్ సెల్యూట్.. కారల్ మార్క్స్" కమ్యూనిజం తోనే దోపిడీ సమాజాన్ని కూల్చుతాం! అంటూ నినాదాలు ఇచ్చారు.

కార్ల్ మార్క్స్ 1818 మే 5 – 1883 మార్చి 14 జర్మన్ శాస్త్రవేత్త, తత్త్వవేత్త, ఆర్థికవేత్త, సామాజికవేత్త, పాత్రికేయుడు, సోషలిస్టు విప్లవకారుడు. ప్రస్తుత జర్మనీలోని ట్రయర్ పట్టణంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మార్క్స్, రాజకీయ ఆర్థికశాస్త్రం, హెగెలియన్ తత్త్వశాస్త్రం చదువుకున్నాడు. యుక్తవయస్సులో మార్క్స్ ఏ దేశపు పౌరసత్వం లేని స్థితిలో, లండన్లో జీవితం గడిపాడు. లండన్లోనే మరో జర్మన్ ఆలోచనాపరుడైన ఫ్రెడెరిక్ ఏంగెల్స్తో కలిసి తన చింతన అభివృద్ధి చేసుకుంటూ, పలు పుస్తకాలు ప్రచురించాడు. 1848 నాటి కరపత్రమైన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వాటన్నిటిలోకీ సుప్రసిద్ధమైంది. తదుపరి కాలపు మేధో, ఆర్థిక, రాజకీయ చరిత్రను అతని రచన ప్రభావితం చేసింది.సమాజం, ఆర్థిక శాస్త్రం, రాజకీయాలు వంటివాటిపై మార్క్స్ సిద్ధాంతాలను కలగలిపి మార్క్సిజంగా పిలుస్తున్నారు. మార్క్సిజం ప్రధానంగా మానవ సమాజాలు వర్గ పోరాటాల ద్వారా అభివృద్ధి చెందాయని, పెట్టుబడిదారి వ్యవస్థలో ఇది సహజంగా పాలక వర్గాలకీ శ్రామిక వర్గాలకీ నడుమ ఘర్షణగా పరిణమిస్తుంది. పరాయీకరణ, విలువ, వస్తు మోహం, మిగులు విలువ వంటి తన సిద్ధాంతాల ద్వారా మార్క్స్ పెట్టుబడిదారి వ్యవస్థ వినియోగదారి మనసత్తత్వం అభివృద్ధి చేయడం, సామాజిక అంతరాలు, శ్రమశక్తిని దోపిడీ చేయడం ద్వారా సామాజిక సంబంధాలు, విలువలను ఏర్పరుస్తోందని వాదించాడు. చారిత్రిక భౌతికవాదం అనే విమర్శనాత్మక దృక్పథాన్ని ఉపయోగించి, మార్క్స్ పునాది, పైనిర్మాణ సిద్ధాంతం ని ప్రతిపాదించాడు. సమాజంలోని సాంస్కృతిక, రాజకీయ స్థితిగతులను, అలానే వాటి మానవ స్వభావపు భావనలను ప్రధానంగా నిగూఢమైన ఆర్థిక పునాదులే నిర్ధారిస్తాయని ఈ సిద్ధాంతం చెప్తోంది. ఈ ఆర్థిక విమర్శలు 1867 నుంచి 1894 వరకూ మూడు భాగాలుగా ప్రచురితమైన ప్రభావశీలమైన దాస్ కాపిటల్లో పొందుపరిచారు.మార్క్స్ ప్రకారం, రాజ్యాలు ప్రజలందరి సాధారణ ఆసక్తులకు అనుగుణంగా నడుస్తున్నట్టుగా చూపించుకున్నా, నిజానికి పాలకవర్గం ఆసక్తులకు అనుగుణంగా నడుస్తాయి. గత సామాజిక ఆర్థిక వ్యవస్థల్లాగానే పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత సమస్యలు స్వయం వినాశనానికి దారితీసి, దాని స్థానంలో కొత్త వ్యవస్థ ఐన సామ్యవాదం ఏర్పడుతుందని ఊహించాడు. మార్క్స్ అభిప్రాయంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోని వర్గ వైరుధ్యాలు దాని అస్థిరతకు, సంక్షోభానికి గురయ్యే లక్షణానికి కొంత కారణమై క్రమంగా కార్మిక వర్గం వర్గ చైతన్యాన్ని సాధించడానికి దారితీస్తుంది, ఇది వారు రాజకీయ ఆధిపత్యాన్ని సాధించేందుకు, చివరకు ఉత్పత్తిదారుల స్వేచ్ఛా సంఘటితంగా ఏర్పడే ప్రభుత్వం ద్వారా వర్గ రహిత, కమ్యూనిస్టు సమాజం స్థాపనకు దారితీస్తుంది. మార్క్స్ కార్మిక వర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, సామాజిక ఆర్థిక విముక్తి తీసుకువచ్చేందుకు సంఘటిత విప్లవ చర్య చేపట్టాలని వాదిస్తూ క్రియాశీలకంగా దాని ఆచరణ కోసం పోరాడారు. కార్ల్ మార్క్స్ మానవ చరిత్రలోకెల్లా అత్యంత ప్రభావశీలమైన వ్యక్తుల్లో ఒకరిగా పేరొందాడు, ఆయన కృషి, సిద్ధాంతం అటు ప్రశంసలు, ఇటు విమర్శలు కూడా విస్తృతంగా పొందింది.ఆర్థిక శాస్త్రంలో ఆయన కృషి శ్రమ గురించి, దానికీ పెట్టుబడికీ ఉన్న సంబంధం గురించి ప్రస్తుత అవగాహనకీ, తత్ సంబంధితమైన ఆర్థిక ఆలోచనకీ చాలావరకూ పునాదిగా నిలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా ఎందరో మేధావులు, కార్మిక సంఘాలు, కళాకారులు, రాజకీయ పార్టీలు మార్క్స్ ఆలోచనాధార, తాత్త్వికత, కృషిలకు ప్రభావితం అయ్యాయి, చాలామంది ఆయన ఆలోచనను స్వీకరించడమో, మార్పుచేసుకోవడమో చేశారు. మార్క్స్ మరణించేంతవరకూ ఆయన భావాలు ప్రధానంగా వ్యాప్తి చెందకపోయినా, ఆయన మరణానంతరం వాటి ప్రభావం విస్తరించింది. రష్యన్ విప్లవం మొదలుకొని ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక విప్లవాలు మార్క్సిజం సిద్ధాంతం పునాదిగా చేసినట్టు ప్రకటించుకున్నాయి. 20వ శతాబ్దిలో అనేక దేశాలు మార్క్సిస్టు దేశాలుగా తమను ప్రకటించుకున్నాయి.

ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు హరినాథ్, వెంకటరమణ, ఈశ్వరమ్మ, సెల్వరాజ్, రాజశేఖర్, దీప, భారతి, కుమారి, గీత, హేమనాదు పాల్గొన్నారు.

మొట్టమొదటిసారిగా ఆత్మకూరు పట్టణం నందు పాలిసెట్ ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఆత్మకూరు ఉత్తేజిత

మొట్టమొదటిసారిగా ఆత్మకూరు పట్టణమునకు పాలీసెట్ పరీక్షా కేంద్రాన్ని ప్రభుత్వం వారు మంజూరు చేసినారు ఆ పరీక్షా కేంద్రాలలో గత నెల 25వ తారీఖున పాలిసెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరిగినది అందులో దాదాపు 650 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగింది పాలిసెట్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు ఈరోజు అనగా 65 2026న విడుదల అయినాయని నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ డాక్టర్ జి సురేష్ బాబు గారు (హెడ్ ఆఫ్ జనరల్) మరియు బీవీ రమణ ప్రసాద్ గారు (హెడ్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్) తెలిపారు మారుమూల ప్రాంతాలైన కొత్తపల్లి మండలం పాములపాడు ఆత్మకూరు మండలాల విద్యార్థిని విద్యార్థులు పాలిసెట్ పరీక్షలను చాలా బాగా రాసి మంచిర్యాంకులు తెచ్చుకున్నారని బివి రవణ ప్రసాద్ గారు డాక్టర్ జి సురేష్ బాబు గారు (హెడ్ ఆఫ్ జనరల్) అధ్యాపకులు ఎం నవీన్ బాబు. కే ఉమామహేశ్వరప్ప (అధ్యాపకులు)సంతోషాన్ని వ్యక్తం చేశారు పరీక్ష ఫలితాలను విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్లో చెక్ చేసుకుని వారి ర్యాంకులు చూసుకోగలరు త్వరలో కాలేజీలకు అప్లై చేసుకోవాలని కోరారు

గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్సులు పంపిణీ

ఆత్మకూరు ఉత్తేజిత

ఆత్మకూరు మండలము పెద్ద చెరువులో నివసిస్తున్న గిరిజనులకు శాసనసభ్యులు బుడ్డ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా 42 మంది గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమము ఆత్మకూరు మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో గిరిజనులకు లైసెన్స్ అప్లై చేసి లైసెన్స్ మంజూరు చేయడము జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవిలో జీవనం సాగిస్తున్న గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్స్ సౌకర్యం కల్పించాలని ఉద్దేశంతో ఆర్టీవో చేసిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్స్ లేక వాహన ప్రమాద బీమాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సులు ఉంటే గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జీవనోపాధి మెరుగుపడుతుందని ఆశాభావము వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి మైనార్టీ నాయకురాలు షబానా, మరియు మండల టిడిపి నాయకులు పట్టణ నాయకులు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ సిపిఎస్ ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పించాలి....

తిరుపతి ఉత్తేజిత మే 5.

తిరుమల తిరుపతి దేవస్థానంలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన సిపిఎస్ ఉద్యోగులు ప్రస్తుతం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తితిదే ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. ఈ మేరకు తితిదే కార్యనిర్వహణ అధికారి ముద్దాడ రవిచంద్రకు వినతిపత్రం సమర్పించారు.

?మనిషి జీవితంలో ఆరోగ్యం అత్యంత కీలకమని, ముఖ్యంగా వయస్సు పెరిగిన తర్వాత వైద్య అవసరాలు మరింత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అటువంటి సమయంలో రిటైర్డ్ ఉద్యోగులకు అందుబాటులో ఉండే వైద్య సదుపాయాలు కల్పించడం ప్రాథమిక బాధ్యత అని వివరించారు. ప్రస్తుతం పింఛను పొందుతున్న ఉద్యోగుల నుంచి నెలకు రూ.800 వసూలు చేస్తూ వారికి ఆరోగ్య నిధి ద్వారా వైద్యం అందిస్తున్నారని, అయితే పింఛను లేదనే కారణంతో సిపిఎస్ ఉద్యోగులను ఈ పథకం నుంచి మినహాయించడం సరికాదని అన్నారు.

?దీని పరిష్కారానికి రిటైర్డ్ సిపిఎస్ ఉద్యోగుల కోసం ప్రత్యేక ఖాతాను ఏర్పాటు చేసి, వారి నుంచి కూడా తగిన మొత్తాన్ని సేకరించి ఆరోగ్య నిధి పథకంలో భాగస్వాములను చేయాలని కోరారు. పింఛను ఉద్యోగులతో సమానంగా సిపిఎస్ ఉద్యోగులకు కూడా అన్ని వైద్య సౌకర్యాలు వర్తింపజేయాలని, దీనిపై కార్యనిర్వహణ అధికారి తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని చీర్ల కిరణ్ విజ్ఞప్తి చేశారు.

పది పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ సత్కారం....

తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజిత మే 5.

2025--26 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ మంగళవారం ఘనంగా సత్కరించారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ యాజమాన్యాల పాఠశాలల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కలెక్టర్ మెమెంటోలు, శాలువాలు అందజేసి అభినందించారు.

?విద్యా సంస్కరణల ఫలితమే ఈ విజయం: కలెక్టర్

?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో గత రెండేళ్లుగా అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులను వారి అభ్యసన సామర్థ్యాల ఆధారంగా "స్ట్రీమ్, మౌంటెన్, స్కై" విభాగాలుగా వర్గీకరించి బోధించడం, '100 డేస్ యాక్షన్ ప్లాన్'ను పక్కాగా అమలు చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని వివరించారు. రాష్ట్రస్థాయి ర్యాంకర్ల వివరాలను మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతున్నామని తెలిపారు. విద్యాశాఖను దేశంలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు.

?విజేతల వివరాలు (యాజమాన్యాల వారీగా):

?ఏపీ మోడల్ స్కూల్స్ : తనికొండ చిద్విలాస్ (ఎర్రావారిపాలెం – 586), కొంపాల ముని పూజిత (వెంకటగిరి – 585), తోట రాజా (వెంకటగిరి – 585).ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు : పాయసం ఇందు (వెంకటగిరి – 586), వెంపర్ల సంజనా (వెంకటగిరి – 586), పలూరు తనిష్ (ఓజిలి – 579).

?సాంఘిక సంక్షేమ గురుకులాలు : రాయపాటి ఏంజెల్ ప్రియా (నాయుడుపేట – 576), రౌతు జెస్సికా (నాయుడుపేట – 571), ఒలివా (పుత్తూరు – 570).

?గిరిజన సంక్షేమ గురుకులాలు : భుక్య శివశంకర్ నాయక్ (రేణిగుంట – 560), తుమ్మల మధు (రేణిగుంట – 558), దుర్తాటి పవిత్ర (శ్రీకాళహస్తి – 556).

?బీసీ సంక్షేమ పాఠశాలలు: అరుముల్ల మధు (దొరవారి సత్రం – 584), పంచేటి సుదీప్ (కోట – 582), యల్లంపల్లి ఇందు (చంద్రగిరి – 580).

?కేజీబీవీ పాఠశాలలు: జమ్మల సన్నీ హిత (దొరవారి సత్రం – 539), బత్తుల జెస్సీ (వెంకటగిరి – 532), గండు లోహిత (వెంకటగిరి – 528).

?ఎంపీపీ ఉ జెడ్పీ పాఠశాలలు: ఎస్. దిశిత సాయి (వరదయ్యపాలెం – 595), ప్రసాది మొహిత్ చరణ్ సాయి (శ్రీకాళహస్తి – 591), కన్నవరం రేఖ (వరదయ్యపాలెం – 591).

?మున్సిపల్ పాఠశాలలు: గణితాల సాయి పూజిత (శ్రీకాళహస్తి – 594), ఓవియా (తిరుపతి అర్బన్ – 583), కేశంసెట్టి చందన ప్రియ (తిరుపతి అర్బన్ – 580).ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు: సమను గీతికా రెడ్డి (తిరుపతి – 587), కొట్టే అమని (తిరుపతి – 587), మెడ దత్తసాయి చెరిష్మా (తిరుపతి – 584).

?ప్రభుత్వ పాఠశాలలు : గుడపాకం నిహారిక (తిరుపతి – 590), నీరుగట్టి అక్షయ్ (పాకాల – 588), దొడ్డగ నివేధ (సత్యవేడు – 582).

?ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీ వారి సౌజన్యంతో పేటలో చలివేంద్రం!....

సామాజిక బాధ్యతగా చలివేంద్రం ఏర్పాటు...

రేణిగుంట ఉత్తేజిత మే 5.

తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ ఆలోచన మేరకు మంగళం డిపో మేనేజర్ సుధాకర్ సూచనలతో మంగళం డిపోలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న స్టార్ కృష్ణ మంగళవారం, ఏర్పేడు మండలంలోని పాపానాయుడు పేట బస్ స్టాండ్ కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చడం ఒక సామాజిక బాధ్యతగా భావించిన తిరుపతి రీజనల్ మేనేజర్ జగదీష్ ఆలోచనలకు అనుగుణంగా ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు స్టార్ కృష్ణ తెలిపారు. ఈ మంచి కార్యక్రమంలో పాపానాయుడు పేట కు చెందిన నాయకులు అర్జున్ బాబు, వడివేలు, దొర కృష్ణా మరియు రమేష్, చెంగలరాయులు,అర్జున,తిరుమల, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి

తిరుపతి ఉత్తేజిత మే 5

రెండేళ్లుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం... అధికారుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ ... కాళ్లు అరిగేలా పొట్ట చేత పట్టుకొని తిరుగుతున్న స్విమ్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర చైర్మన్ బిఆర్ నాయుడు లు ముందుకు రావాలని తాము ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. మంగళవారం నాటి ఉదయం స్థానిక కపిల్ తీర్థం రోడ్ లోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట స్విమ్స్ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. గత రెండేళ్లుగా అధికారులు తమను శానిటేషన్ హోదా నుంచి తప్పించి వార్డు బాయ్ లుగా గుర్తించాలని చేస్తున్న పోరాటాన్ని పట్టించుకోకపోవడం దారుణమని సిహెచ్ నర్సింగరావు విమర్శించారు.

గత ఓ ప్రస్తుత కలెక్టర్ ఎస్పీ ఆర్డిఓ స్విమ్స్ డైరెక్టర్ మరియు ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు తాము చేస్తున్న పోరాటాన్ని న్యాయమైనదని ప్రకటించి మూడు నెలలలో సమస్యను పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని, శానిటేషన్ హోదాను రద్దు చేస్తామని హామీని ఇచ్చారని సిహెచ్ నర్సింగరావు గుర్తు చేశారు. 10 నెలలు పూర్తవుతున్నా అమలు చేయకపోవడంతో అనివార్యమై గత 68 రోజులుగా ఎర్రటి ఎండలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ నాలుగు రోజు ల్లో సమస్యను పరిష్కరిస్తామన్న ఇఓ సైతం తమ గోడును పట్టించుకోవడంలేదని, ఏడాది కిందట న్యాయమైన సమస్య రెండు రోజులలో పరిష్కారం అవుతుందని ప్రకటించిన టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు సైతం పరిష్కరించకపోవడం న్యాయం కాదని అన్నారు. బుధవారం నాడు జరిగే బోర్డు సమావేశంలోనైనా ఈ సమస్యకు ముగింపు పలకాలని కందారపు మురళి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం, ఎస్ జయచంద్ర, మాధవ్, వేణుగోపాల్, బుజ్జి, వాసు, రవి, సూరి, ముత్తు, గోపి, జయమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ఆత్మకూరు ఉత్తేజిత

కంబాలపల్లె గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసిన తహసిల్దార్ జి.సుభద్రమ్మ

పాములపాడు:– రైతుల సంక్షేమమే లక్ష్యంగా, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను పాములపాడు మండలంలోని, కంబాలపల్లె గ్రామంలో జరిగిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న తహసిల్దార్ జి.సుభద్రమ్మ రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ భాస్కర్, వీఆర్వోలు శివన్న, మక్బూల్, మద్దిలేటి, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, వీఆర్ఏలు నాయక్, తదితర రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొనడం జరిగింది.

దేశీయ సూచీలకు భారీ లాభాలు..

సెన్సెక్స్ 1100ం.. నిఫ్టీ 22,800 పైకి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు దేశీయంగా ఫైనాన్షియల్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో వరుసగా రెండోరోజూ సూచీలు లాభపడ్డాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1200 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 22,800 ఎగువన ముగిసింది. అన్ని రంగాల షేర్లు లాభాల్లో ముగిశాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌లో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్క సెషన్‌లో రూ.6.85 లక్షల కోట్లు పెరిగి రూ.400.03 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 74,608.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,169.95) లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,385.76 గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1131.31 పాయింట్లు లాభపడి 75,301.26 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 325.55 పాయింట్ల లాభంతో 22,834.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 బలపడి 86.54గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ నష్టాలు చవిచూశాయి. అతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.11 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 3034 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవే..

నిన్నటి అమెరికా మార్కెట్లతో పాటు, నేడు ఆసియా మార్కెట్లలో ర్యాలీ కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ అది ప్రతిబింబించింది. చైనా ఉద్దీపన చర్యల కారణంగా హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2 శాతం మేర లాభంతో మూడేళ్ల గరిష్ఠానికి చేరింది.

అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో చైనా తీసుకున్న ఉద్దీపన చర్యలకు దిగింది. వినియోగాన్ని పెంచేందుకు అక్కడి ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతో ఆ దేశం నుంచి మెటల్‌కు డిమాండ్ పెరుగుతుందనే అంచనాలతో ఆ రంగ స్టాక్స్ లాభపడ్డాయి. వాణిజ్య యుద్ధభయాలతో చాలాకాలంగా మార్కెట్లు నష్టాల్లోనే ట్రేడయ్యాయి. వరుస నష్టాల నేపథ్యంలో చాలా కంపెనీల స్టాక్స్ ఆకర్షణీయంగా ఉన్నాయని విశ్లేషకులు తమ అభిప్రాయాలు వ్యక్తంచేయడం మార్కెట్‌కు కలిసొచ్చింది. భారత వాణిజ్యలోటు మూడున్నర ఏళ్ల కనిష్ఠానికి దిగడం మార్కెట్‌కు సెంటిమెంట్‌ను బలపరిచింది. 2025 ఆర్థిక సంవత్సరంలో క్యూ3లో జీడీపీ వృద్ధి 6.2 శాతంగా నమోదు కావడం, పారిశ్రామిక ఉత్పత్తి లో 5.1 శాతం పెరుగుదల, స్థూల పన్ను వసూళ్లలో 16 శాతం పెరుగుదల, రిటైల్ ద్రవ్యోల్బణం 3.6 శాతానికి తగ్గడం సానుకూల అంశాలు మార్కెట్ ర్యాలీకి కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

త్వరలో పెరగనున్న టాటా మోటార్స్ వాహన ధరలు

2026, ఏప్రిల్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాలతో సహా తన ప్రయాణీకుల వాహన ధరలను పెంచాలని యోచిస్తున్నట్లు టాటా మోటార్స్ ఈరోజు(మంగళవారం) తెలిపింది. పెరుగుతున్న ఖర్చుల ప్రభావాన్ని పాక్షికంగా భర్తీ చేయడానికి ఈ ధరల సర్దుబాటు చేపట్టబోతున్నట్లు సంస్థ పేర్కొంది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు పరిధి మారుతుందని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జనవరిలోనే, కంపెనీ తన ప్రయాణీకుల వాహన పోర్ట్‌ఫోలియో ధరలను 3 శాతం వరకు పెంచింది. టాటా మోటార్స్ వివిధ రకాల ప్యాసింజర్ వాహనాలను విక్రయిస్తోంది. వాటిలో రూ.5 లక్షల నుంచి రూ.25.09 లక్షల ధరల(ఎక్స్-షోరూమ్ దిల్లీ) వరకు ఎలక్ట్రిక్ వాహనాలు కూడా ఉన్నాయి. టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనాల శ్రేణి ధరలను సైతం వచ్చే నెల నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు సోమవారం తెలిపింది. మారుతి సుజుకీ ఇండియా కూడా తన మొత్తం మోడల్ శ్రేణి ధరలను వచ్చే నెల నుంచి 4 శాతం వరకు పెంచాలని యోచిస్తున్నట్లు ఇప్పటికే తెలిపింది.

జెప్టోలో యాపిల్ ఉత్పత్తులు.. నిమిషాల్లోనే డెలివరీ

ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో తన వ్యాపారాన్ని వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే రోజువారీ ఆర్డర్లలో కొత్త మైలురాయిని సొంతం చేసుకుంటున్న సంస్థ తాజాగా తన ప్లాట్‌ఫామ్‌లో యాపిల్ ఉత్పత్తులను జోడించినట్లు తెలిపింది. వివిధ రకాల యాపిల్ ఉత్పత్తులను ఎంపిక చేసిన నగరాల్లో కేవలం 10 నిమిషాల్లోనే డెలివరీ చేయనుంది. ఈ విషయాన్ని కంపెనీ సీఈఓ అదిత్ పలిచా లింక్డిన్ వేదికగా తెలిపారు. "గత 60 రోజుల్లో యాపిల్ ఉత్పత్తుల కోసం పెద్ద సంఖ్యలో వినియోగదారులు మా ప్లాట్‌ఫామ్‌ని ఆశ్రయించారు. మేము దాన్ని గుర్తించాం. అందుకే ప్లాట్‌ఫామ్‌లోయాపిల్ ప్రొడక్ట్స్‌ని అందిస్తున్నాం. ఈరోజు నుంచే డెలివరీ చేయనున్నాం. దీని కోసం సహకరిస్తున్న జెప్టో ఎలక్ట్రానిక్ బృందానికి ధన్యవాదాలు" అని పలిచా పేర్కొన్నారు. సోషల్‌మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. యాపిల్ 16ఈ, ఎయిర్‌పాడ్స్, ఐప్యాడ్‌లను క్షణాల్లోనే డెలివరీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. క్విక్ కామర్స్ విభాగంలో ఇప్పటికే రాణిస్తున్న స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బ్లింకిట్, బిగ్‌బాస్కెట్ ఈ సంస్థలన్నీ ఇప్పటికే ఐఫోన్‌తో పాటు ఇతర యాపిల్ ఉత్పత్తుల్ని డెలివరీ అందిస్తున్నాయి.

ఈ జనరేషన్‌కు ఆ సామర్థ్యాలు లేవు.. ఓ సంస్థ సీఈఓ కామెంట్స్ వైరల్

ప్రస్తుతం జనరేషన్ గురించి సోషల్ మీడియాలో తెగ చర్చ నడుస్తోంది. తాజాగా వీరి గురించి బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ CEO ఆశిష్ గుప్తా కీలక విషయాలను వెల్లడించారు. ఆశిష్ లింక్డ్‌ఇన్‌లో చేసిన ఒక పోస్ట్‌లో జనరేషన్ %% గురించి కీలకమైన అంశాలను ప్రస్తావించారు. ఈ జనరేషన్ రీల్స్ చేయడం, డిజిటల్ ట్రెండ్స్, వైరల్ కంటెంట్ సృష్టించడంలో చాలా నైపుణ్యం కలిగివుంటారు. కానీ, వీరికి ప్రాథమిక గణితం, ఆర్థిక అక్షరాస్యత, మంచి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం చాలా తక్కువగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సీఈఓ అనుభవం

ఆ పోస్ట్‌లో ఆశిష్ గుప్తా తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. ఇటీవల ఒక ప్రముఖ సంస్థలో క్యాంపస్ నియామక ప్రక్రియలో, %దీదీూ, దీజూ% వంటి డిగ్రీలతో ఉన్న కొత్త గ్రాడ్యుయేట్లను నియమించుకోవడంపై ఆయన చర్చించారు. ఈ సందర్భంలో 50 మందికి పైగా విద్యార్థులను ఒక గణిత ప్రశ్నను అడిగినట్లు చెప్పారు. ఒక కారు మొదట 60 కి.మీ. 30 కి.మీ వేగంతో, తర్వాతి 60 కి.మీ, 60 కి.మీ వేగంతో ప్రయాణిస్తే, దాని సగటు వేగం ఎంత? అని అడిగినట్లు తెలిపారు. ఈ ప్రశ్నకు కేవలం ఇద్దరు విద్యార్థులే సరైన సమాధానం ఇచ్చారని వెల్లడించారు. కానీ మిగిలినవారు మాత్రం దీనిని సరైన విధంగా పరిష్కరించడానికి చాలా ఇబ్బంది పడినట్లు చెప్పారు.

దీనిని బట్టి చూస్తే సోషల్ మీడియా ప్రభావం ప్రస్తుతం జనరేషన్ పై ఏ మేరకు ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ జనరేషన్ ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, వైరల్ కంటెంట్, డిజిటల్ ట్రెండ్‌ల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారని ప్రస్తావించారు. కానీ ప్రాథమిక గణిత సమస్యలను పరిష్కరించడం లేదా ఆర్థికంగా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలు మాత్రం వీరికి లేవని అనిపించినట్లు వెల్లడించారు.

విమర్శలు వచ్చినప్పుడు..

రూ.199 ప్లాన్ అదుర్స్..

దేశ టెలికాం రంగంలో పోటీ క్రమంగా మరింత పెరుగుతోంది. ఈ క్రమంలోనే రీఛార్జ్ ప్లాన్ల విషయంలో ఆయా సంస్థలు పోటీ పడి మరి ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో %దీూచీూ% (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) తాజాగా మరో క్రేజీ ఆఫర్ ప్రకటించింది. వినియోగదారుల కోసం 84 రోజుల ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త ప్లాన్ వినియోగదారులకు అనేక ప్రయోజనాలను అందిస్తోంది. డేటా, కాలింగ్ వంటి అనేక సేవలను అందిస్తోంది.

ఈ రూ.599 ప్లాన్ ద్వారా రోజుకు 3+దీ హై స్పీడ్ డేటా అందిస్తున్నారు. ఈ క్రమంలో మొత్తం 84 రోజుల పాటు రోజుకు 3+దీ హై స్పీడ్ డేటా, అంటే మొత్తం 252+దీ డేటా వినియోగంలోకి రానుంది. దీనిని గేమింగ్, వీడియో స్ట్రీమింగ్ సహా పలు రకాల పనులను ఉపయోగించుకోవచ్చు. అంటే ఈ లెక్కన చూస్తే నెలకు 199 రూపాయలు మాత్రమే పడనుంది. ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ అందించబడతాయి. అంటే, మీరు ఎన్ని కాల్స్ అయినా చేసుకోవచ్చు. అలా మీరు ఇతర నెట్‌వర్క్‌లతో కూడా లిమిట్ లేకుండా మాట్లాడుకోవచ్చు. దీంతోపాటు 100 ఉచిత ౙమీలు ప్రతిరోజూ లభిస్తాయి. ఇది మీకు రోజువారీ కమ్యూనికేషన్‌కు ఉపయోగపడుతుంది.

ఈ 84 రోజుల ప్లాన్ ప్రధానంగా ధీర్ఘ కాలం రీఛార్జ్ చేసుకునే అవసరం లేకుండా ఉంటుంది. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం చూస్తున్న వినియోగదారులు, ఇలాంటి ప్లాన్‌ను ఎంచుకోవడం ద్వారా అవసరమైన అన్ని సేవలను పొందవచ్చు. దీంతో ఈ ప్లాన్ ద్వారా మీరు వారానికి లేదా నెలకు రీఛార్జ్‌లు చేయాల్సిన అవసరం లేకుండా, డేటా, కాలింగ్ సేవలను ఈజీగా పొందవచ్చు.

ఇన్వెస్టర్లకు శుభవార్త.. త్వరలో అమెజాన్ ఐపీఓ

ఇన్వెస్టర్లకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఎందుకంటే అమెరికాకు చెందిన ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ కూడా ఇండియాలో తన భారతీయ విభాగాన్ని సపరేట్ చేసి స్టాక్ మార్కెట్లో ఐపీఓకు రావాలని చూస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే కంపెనీ వర్గాలు చర్చలు ప్రారంభించినట్లు తెలిసింది. ఈ క్రమంలో అమెజాన్ తన వాల్ స్ట్రీట్ బ్యాంకింగ్ భాగస్వామి జేపీ మోర్గాన్‌తోపాటు భారతదేశంలోని పెట్టుబడి బ్యాంకులతో చర్చలు ప్రారంభించిందని ఓ నివేదిక తెలిపింది.

ఇప్పటికే పలు బ్యాంకులతో..

ఈ నేపథ్యంలో గత వారం అమెజాన్ ఇండియా దీని కోసం 8 నుంచి 10 పెట్టుబడి బ్యాంకులను ఆహ్వానించింది. భారత నిబంధనల ప్రకారం, దేశీయ కంపెనీలు మాత్రమే ఇన్వెంటరీ ఆధారిత ఇ-కామర్స్ మోడల్ కింద పనిచేస్తాయి. తద్వారా వేగవంతమైన డెలివరీలు, షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.

అయితే, విదేశీ సంస్థలు కొనుగోలుదారులు, విక్రేతల మధ్య మధ్యవర్తిగా పనిచేసే మార్కెట్ ప్లేస్ మోడల్ విధానాన్ని అనుసరించాలి. ఈ నియంత్రణ అంతరం చాలా కాలంగా అమెజాన్‌కు సవాలుగా మారింది. మరోవైపు ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ జియోమార్ట్ వంటి స్వదేశీ కంపెనీలతో సమర్థవంతంగా పోటీ పడే సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది.

2030 నాటికి

ఈ నిర్ణయం ద్వారా అమెజాన్ ప్రధానంగా స్థానిక డేటా అవసరాలు, భారతదేశంలో ప్రత్యక్ష జాబితాను నిర్వహించగల సామర్థ్యాన్ని కల్గి ఉంటుందని నివేదిక తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లో ఖర్చులు తగ్గిపోయి, వ్యాపారం పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే భారతదేశంలో ఈ-కామర్స్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇంటర్నెట్ వ్యాప్తి, డిజిటల్ చెల్లింపు పరిష్కారాలు పెరుగుతున్నాయి. దీంతో ఈ పరిశ్రమ 2030 నాటికి 350 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ విభాగంలో అపారమైన వృద్ధి అవకాశం ఉందని చెబుతున్నారు.

వ్యూహాత్మక చర్యలు

ఈ నేపథ్యంలో భారతదేశంలో తన వ్యాపారాన్ని విస్తరించడానికి అమెజాన్ వ్యూహాత్మక చర్యలు తీసుకుంటోంది. కంపెనీ ఇటీవల బెంగళూరులో తన క్విక్-కామర్స్ సర్వీస్ అమెజాన్ నౌను ప్రారంభించింది. దీని వల్ల వేగవంతమైన డెలివరీతో వినియోగదారులకు ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు జరుగుతాయి. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి కంపెనీలు వచ్చిన నేపథ్యంలో మార్కెట్లో పోటీ ఎక్కువైంది.

ఫ్లిప్‌కార్ట్ కూడా..

అంతేకాదు ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ తన స్వస్థలాన్ని భారతదేశానికి మార్చే ప్రక్రియలో ఉంది. 2025 లేదా 2026 ప్రారంభంలో %ఝూ%కి రావాలని ప్లాన్ చేస్తోంది. అమెజాన్ తన స్పిన్‌ఆఫ్‌తో ముందుకు సాగితే, అది భారత మార్కెట్లో తన పట్టును బలోపేతం చేసుకోనుంది. దీంతో స్థానిక మార్కెట్లో ఆయా సంస్థల మధ్య పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది.

షార్క్‌ట్యాంక్' షోలో తెలుగు షార్క్.. శ్రీకాంత్ బొల్లా!

యువ వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తూ.. వారి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు 'సోనీ లీవ్' ఛానల్ నిర్వహిస్తున్న కార్యక్రమం 'షార్క్ ట్యాంక్ ఇండియా'. ప్రస్తుతం నాలుగో సీజన్ ప్రసారమవుతోంది. ఇందులో అనుమప్ మిట్టల్ (షాదీ.కామ్), అమన్ గుప్తా (బోట్), వినీత సింగ్ (షుగర్ కాస్మోటిక్స్), నమితా థాపర్ (ఎమ్‌క్యూర్ ఫార్మా), పీయూష్ బన్సల్ (లెన్స్‌కార్ట్) షార్క్‌గా వ్యవహరిస్తుంటారు. మరికొంత మంది గెస్ట్ షార్క్‌గా వచ్చి పెట్టుబడులు పెడుతుంటారు. తాజాగా తెలుగు దివ్యాంగ వ్యాపారవేత్త, బొల్లాంట్ ఇండస్ట్రీస్ అధినేత శ్రీకాంత్ బొల్లా కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. షార్క్‌లో ఒక్కరిగా మారి స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. ఈ ఎపిసోడ్‌కు సంబంధించి సోనీలివ్ ఓ ప్రోమోను విడుదల చేసింది.

స్టార్‌లింక్‌కు భారత్‌లో స్పెక్ట్రమ్

శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ తో దేశీయ అగ్రగామి టెలికాం సంస్థలు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో మరికొద్ది రోజుల్లో భారత్‌లో స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే, దీనికి అనుమతులిచ్చేందుకు కేంద్రం కఠిన షరతులు విధించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. తాజాగా 'పన్ను' సవాళ్లు కూడా ఎదురవుతున్నట్లు తెలుస్తోంది.

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు స్పెక్ట్రమ్ పన్ను విధించే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. ఈ పన్ను విధిస్తే దేశంలో శాట్‌కామ్ వెంచర్‌కు సర్వీస్ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. దేశీయ నెట్‌వర్క్ ప్రొవైడర్లయిన రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియాకు కొన్నేళ్ల క్రితమే ఈ స్పెక్ట్రమ్ పన్నును రద్దు చేసిన సంగతి తెలిసిందే.

దేశంలో స్టార్‌లింక్ సేవల ద్వారా కంపెనీకి వచ్చే సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్)పై దాదాపు 3శాతం స్పెక్ట్రమ్ వినియోగ రుసుము విధించే అంశంపై కేంద్రం యోచిస్తున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. "వేలానికి బదులుగా శాటిలైట్ ఆపరేటర్లకు నేరుగా స్పెక్ట్రమ్‌ను కేటాయిస్తున్నందున.. ఈ వినియోగ ఛార్జీలు వర్తిస్తాయి. అంటే.. టెల్కోలు చెల్లించే 8శాతం లైసెన్సు ఫీజు మాత్రమే కాకుండా.. శాట్‌కామ్ ఆపరేటర్లు స్పెక్ట్రమ్ కోసం అదనపు ఛార్జీలు కట్టాల్సి ఉంటుంది. అది ఏజీఆర్‌పై 3శాతం కంటే ఎక్కువ కూడా ఉండొచ్చు. ఇందుకు సంబంధించిన తుది రేట్లపై చర్చలు జరుగుతున్నాయి" అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ ఛార్జీలు, శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపు కాలవ్యవధి వంటి అంశాలు ట్రాయ్ వద్ద చర్చల దశలో ఉన్నాయి. వీటి అనంతరం స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం ట్రాయ్ తన ప్రతిపాదనలను టెలికాం విభాగానికి పంపుతుంది. అక్కడ పరిశీలన తర్వాత డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్‌కు పంపిస్తారు. డీసీసీ అనుమతులు పొందిన తర్వాత కేబినెట్ ఆమోదించాల్సి ఉంటుంది.

ఈ పేస్టుతో దంతాలు తెల్లగా మారతాయట..

దంతాల ఆరోగ్యాన్ని కాపాడడంలో టూత్‌పేస్ట్ కీ రోల్ పోషిస్తుంది. దీని కోసం కాస్లీ టూత్ పేస్ట్, పౌడర్ వంటివి వాడాల్సిన పనిలేదు. దంతాల సమస్య రాకుండా ఉండేందుకు మళ్ళీ డెంటల్ హాస్పిటల్కి వెళ్తాం. దంతాలు స్ట్రాంగ్, హెల్దీగా ఉండాలంటే దానికి కొన్ని టిప్స్ పాటించాలి. ఈ మధ్యకాలంలో వచ్చే టూత్‌పేస్టులు, పౌడర్స్ కెమికల్స్‌తో తయారవుతున్నాయి. వీటి బదులు ఇంట్లోనే మనం నేచురల్‌గా పేస్ట్, పౌడర్స్ తయారు చేయొచ్చు. అదెలానో తెలుసుకోండి.

కావాల్సిన పదార్థాలు.. ఈ పౌడర్ తయారు చేసేందుకు మూడు పదార్థాలు అవసరం. అవి పటిక, లవంగాలు, బేకింగ్ సోడా కావాలి. వీటితో పేస్టుని ఈజీగా తయారు చేయొచ్చు.

తయారీ విధానం.. ముందుగా పాన్ పెట్టి వేడి చేయాలి. ఇందులో పటిక వేసి వేడి చేయాలి. ఇది కరగనివ్వాలి. ఇప్పుడు దీనిని మిక్సీ జార్‌లో వేయాలి. పాన్‌లో ఆరు నుంచి ఎనిమిది లవంగాలు వేసి వేయించాలి. వీటిని గ్రైండర్‌లో వేసి రెండింటినీ మెత్తగా మిక్సీ పట్టాలి. ఇప్పుడు ఈ మిశ్రమంలో రెండు టేబుల్ స్పూన్ల బేకింగ్ సోడా వేసి కలపాలి. దీనిని జార్‌లో స్టోర్ చేసి వాడుకోవచ్చు.

ఈ టూత్‌పేస్టుతో లాభాలు.. ఈ పేస్టుని వాడడం వల్ల క్యావిటీస్ తగ్గుతాయి. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దీంతో పళ్ళు తోమితే క్యావిటీస్ తగ్గుతాయి. దంతాల చుట్టూ ఉండే చిగుళ్ళు గట్టి పడతాయి.

చిగుళ్ళ రక్తస్రావం.. ఈ టూత్ పౌడర్ వాడితే చిగుళ్ళ నుండి రక్తస్రావం తగ్గుతుంది. ఎందుకంటే ఇందులో వాడే హీలింగ్ గుణాలు, లవంగాలు దంతాలను బలంగా మారుస్తాయి.

దంతాల తెలుపు.. చాలా మందికి దంతాల పసుపు రంగులోకి మారతాయి. మనం తినే ఆహారం కారణంగా పళ్ళు పసుపు రంగులోకి మారతాయి. అలాంటి సమస్యని దూరం చేసేందుకు బేకింగ్ సోడా దంతాలను తెల్లగా మారుస్తాయి. వీటితో పాటు.. ఈ పేస్టుని వాడడం వల్ల మన దంతాల్లో పేరుకుపోయిన సూక్ష్మక్రిములని దూరం చేసి నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బేకింగ్ సోడా నురగని తీసుకొస్తుంది. అందుకే ఈ పేస్టుని వాడొచ్చు. దీని వల్ల దంతాలలో ఉన్న సూక్ష్మ క్రిములు దూరమవుతాయి. ఈ పేస్టులో లవంగాల గుణాలు ఉన్నాయి. కాబట్టి, బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్ఫెక్షన్‌ని దూరం చేసే యాంటీ సెప్టిక్‌గా పనిచేస్తాయి. ఈ కారణంగానే చాలా బ్రాండెడ్ టూత్‌పేస్టు, మౌత్ వాషెస్‌లో లవంగాలు వాడతారు. మీరు ఎప్పుడు ఫుడ్ తిన్నా ఉదయం, సాయంత్రం రెండు సార్లు పళ్ళు తోమడం అలవాటు చేసుకోండి. దీంతో మీ దంతాలు క్లీన్ అవుతాయి. దంతాలు పసుపు రంగులోకి మారకుండా ఉంటాయి.



వండిన తర్వాత మాత్రమే తినాలి..

పచ్చి కూరగాయలు తింటే.. ఆరోగ్యానికి మంచిదా..? ఉడకబెట్టిన కూరగాయలు తింటే.. మంచిదా? అనే ప్రశ్న చాలామందికి ఉంటుంది. చాలామంది పచ్చికూరగాయల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయనే ఉద్దేశంతో.. పచ్చికూరగాయలు తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఉంటారు. కొన్ని కూరగాయలు వండితే.. వాటిలోని పోషకాలు తగ్గుతాయి. అయితే, కొన్ని కూరగాయలు ఉడికిస్తే.. అవి ఆరోగ్యంగా మారతాయి. వాస్తవానికి, అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, వండిన ఆహారంతో కూడిన ఆరోగ్యకరమైన డైట్ అనుసరించే వ్యక్తులు పచ్చి ఆహారాన్ని అనుసరించే వారి కంటే ఎక్కువ పోషకాలను గ్రహించారు. కొన్ని ఆహార పదార్థాలు కచ్చితంగా ఉడకబెట్టి తినాలని నిపుణులు అంటున్నారు. పాలకూర.. పాలకూర పోషకాల స్టోర్ హౌస్ అని చెప్పొచ్చు. పాలకూరలో దాదాపు 13 రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్ ముప్పు నుంచి రక్షిస్తాయి. పాలకూరలో ఆక్సాలిక్ యాసిడ్ కూడా ఉంటుంది, ఇది ఐరన్, కాల్షియం శోషణను అడ్డుకుంటుంది. ఆక్సాలిక్ యాసిడ్ అధిక ఉష్ణోగ్రతల వద్ద విచ్ఛిన్నమవుతుంది, ఇది పోషకాల శోషణను సులభతరం చేస్తుంది. పాలకూర పచ్చిగా తినడం కంటే.. ఉడకబెట్టి తినడమే మంచిది.

చిలగడదుంప.. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రకారం, చిలగడదుంపలను ఉడకబెట్టడం వల్ల బీటా-కెరోటిన్ స్థాయిలు ఎక్కువవుతాయి. అంతేకాదు, దీనిలోని పోషకాలు శరీరం మరింత సమర్థవంతంగా గ్రహించుకుంటుంది. అందుకే చిలగడదుంపను ఉడకబెట్టి తింటేనే మంచిదని నిపుణులు అంటున్నారు.

పుట్టగొడుగులు.. పుట్టగొడుగులలో ఎర్గోథియోనిన్ అనే యాంటీఆక్సిడెంట్ సమృద్ధిగా ఉంటుంది. ఇది పుట్టగొడుగులు ఉడికించినప్పుడు విడుదల అవుతుంది. ఈ యాంటీఆక్సిడెంట్లు "ఫ్రీ రాడికల్స్" విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి, ఆక్సీకరణ ఒత్తిడి నుంచి శరీర కణాలను రక్షిస్తుంది. గ్రీన్ బీన్స్‌లో లెక్టిన్లు ఉంటాయి, ఇది వివిధ జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. వీటిని ఉడికిస్తే.. లెక్టిన్‌లు న్యూట్రల్ అవ్వడమే కాదు.. త్వరగా జీర్ణం అవుతాయి, యాంటీఆక్సిడెంట్ కంటెంట్ మెరుగుపడుతుంది, రుచి కూడా పెరుగుతుంది న్యూట్రిషన్ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. వంకాయను ఉడికిస్తే.. దానిలో పోషకాలు బైల్ యాసిడ్‌లతో కలిసి బంధించబడతాయి. లివర్ కొలెస్ట్రాల్‌ను మరింత సులభంగా విచ్ఛిన్నం చేస్తుంది.

మేకప్ నుంచి మీ చర్మాన్ని రక్షించుకోవడానికి..



మేకప్ అంటే అమ్మాయిలకు ఎంతిష్టమో స్పెషల్‌గా చెప్పనవరం లేదు. పార్టీలు, ఫంక్షన్స్ ఉన్నప్పుడైతే మేకప్ తప్పని సరి. ఇష్టంతోనే కాదు.. కొందరు వృత్తిలో భాగంగానూ రోజూ మేకప్ వేసుకోవలసి ఉంటుంది. రోజూ మేకప్ వేసుకుంటే.. అది చర్మంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మేకప్ ఉత్పత్తుల్లో కెమికల్స్ కారణంగా చర్మం దెబ్బతింటుంది. మేకప్ కారణంగా చర్మం పొడిబారడం, మొటిమలు, వృద్ధాప్య ఛాయలు త్వరగా రావడం వంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ప్రీ, పోస్ట్ మేకప్ తీసుకుంటే.. మేకప్ నుంచి చర్మాన్ని రక్షించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. చర్మాన్ని మేకప్ నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

సరైన బేస్ ఎంచుకోండి.. మీ రు మేకప్ వేసుకునేముందు, చర్మానికి సరైన బేస్ అప్లై చేయడం చాలా ముఖ్యం. పగటిపూట.. ఫౌండేషన్,క్రీమ్‌ను ధరించే ముందు ప్రైమర్ లాంటి ముగింపుని ఇచ్చే మాయిశ్చరైజర్‌లు, సన్‌స్క్రీన్‌లు అప్లై చేసుకోవడం చాలా ముఖ్యం. సాయంత్రం పూట మేకప్ వేసుకుంటుంటే.. నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌లను ఉపయోగించి చర్మాన్ని హైడ్రేట్ చేయడం ముఖ్యం, దాని తర్వాత.. మేకప్ ఎక్కుసేపు ఉండటానికి.. జెల్ ఆధారిత ప్రైమర్‌ను అప్లై చేయండి.

హానికరమైన పదార్థాలకు దూరంగా ఉండండి.. మేకప్ ఉత్పత్తులకు రంగు, సువాసన ఇవ్వడానికి వాటిలో విషపూరితమైన కెమికల్స్ వాడే అవకాశం ఉంది. ఈ కెమికల్స్ మీ చర్మానికి హాని చేస్తాయి. మీ మేకప్ ఉత్పత్తులలో హానికరమైన కెమికల్స్ లేకుండా జాగ్రత్తపడండి. పారాబెన్స్, ఫార్మాల్డిహైడ్, పాదరసం, థాలేట్స్, సీసం, సమ్మేళనాలు ఎండోక్రైన్ వ్యవస్థలు, సంతానోత్పత్తికి అంతరాయం కలిగిస్తాయి. ఈ కెమికల్స్ కారణంగా.. క్యాన్సర్ ముప్పు కూడా పెరుగుతుంది. మీరు సాధ్యమైనంత వరకు సహజ ఉత్పత్తులు వాడటానికి ప్రయత్నించండి. మీ చర్మానికి మాత్రమే కాకుండా మీ ఆరోగ్యానికి కూడా సురక్షితమైన మేకప్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం.

మేకప్ బ్రష్‌లను శుభ్రం చేయండి.. మేకప్ అప్లై చేయడానికి ఉపయోగించే బ్రష్‌లు, స్పాంజ్‌లు, అప్లికేటర్‌లను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. మీ మేకప్ బ్రష్‌లను యాంటిసెప్టిక్ లిక్విడ్ సబ్బుతో డీప్ క్లీన్ చేయాలి. బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్ ఉపయోగించి స్పాంజ్‌లను శుభ్రం చేసుకోవాలి. స్పాంజ్‌లను బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్‌తో శుభ్రం చేసుకోవచ్చు. ఇవి స్పాంజ్‌ల నుంచి కన్సీలర్, ఫౌండేషన్ మరకలను తొలగిస్తుంది. ప్రతిరోజూ మేకప్ వేసుకునే వారు.. వారానికి రెండుసార్లు మేకప్ బ్లష్‌లను శుభ్రం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్రష్‌లు, స్పాంజ్‌లను ఆరబెట్టడానికి హెయిర్‌డ్రైర్‌ను ఉపయోగించవచ్చు.

మేకప్ శుభ్రంగా రిమూవ్ చేయండి.. మేకప్‌ను సరిగ్గా రిమూవ్ చేయకపోతే.. చర్మ సమస్యలు ఎదురవుతాయి. మేకప్ తొలగించుకునే క్రమంలో రిమూవర్ ఉపయోగించినా.. గట్టిగా రుద్దుతూ మరీ శుభ్రం చేసుకుంటారు కొంతమంది. అయితే ఇలా చేయడం వల్ల చర్మం డ్యామేజ్ అయ్యే ప్రమాదమే ఎక్కువ అంటున్నారు నిపుణులు. అందుకే నెమ్మదిగా తొలగించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చర్మానికి జిడ్డుగా అతుక్కుపోయిన మేకప్‌ను ముందుగా కరిగించాల్సి ఉంటుంది. ఇందుకోసం మేకప్‌ను తొలగించే క్లెన్సర్లు బయట దొరుకుతాయి. ఒక కాటన్ ప్యాడ్‌పై ఈ రిమూవర్‌ను వేసి ముఖమంతా అప్లై చేయాలి. కాస్త ఎక్కువగా మేకప్ వేసిన భాగంలో ఈ కాటన్‌ని కొన్ని సెకన్ల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల మేకప్ కరిగిపోతుంది. అప్పుడు తొలగించడం సులభమవుతుంది. ఆ తర్వాత.. ఒక టీస్పూన్ కొబ్బరినూనెను చేతుల్లోకి తీసుకొని ముఖానికి, మెడకు బాగా పట్టించి 2-3 నిమిషాల తర్వాత కాటన్ ప్యాడ్లతో తుడిచేసుకుంటే సరి. లిప్‌స్టిక్‌ను సైతం కొబ్బరినూనెతో ఇలాగే తొలగించుకోవచ్చు.

తేమనందించండి.. కొన్ని రకాల మేకప్ రిమూవర్స్ చర్మంలోని సహజసిద్ధమైన నూనెల్ని తొలగిస్తాయి. తద్వారా చర్మం పొడిబారిపోతుంది. ఇలాంటప్పుడు మేకప్ తొలగించుకొని, ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత చర్మానికి మాయిశ్చరైజర్ అప్లై చేయడం తప్పనిసరి. ఇక పెదాలకు లిప్‌బామ్, కళ్లకు ఐ క్రీమ్.. వంటివీ ఆయా భాగాల్ని తేమగా ఉంచేందుకు తోడ్పడతాయి.

బియ్యంపిండిని ఇలా అప్లై చేస్తే ఫేస్ గ్లాసీ స్కిన్‌లా మెరుస్తుంది..

పాలు.. ఇవి ఆరోగ్యానికి మాత్రమే మంచిదని చాలా మంది అనుకుంటారు. అయితే, పాలని వాడడం వల్ల అందం కూడా మెరుగవుతుంది. అందులో ముఖ్యంగా బియ్యపిండి. ఈ రెండింటిని కలిపి రాస్తే ఫేస్ క్లీన్ అయి మంచి గ్లో వస్తుంది. అంతే కాకుండా గ్లాసీ స్కిన్ మీ సొంతమవుతుంది. మరి ఈ రెండింటితో కలిపి ఫేస్ మాస్క్‌ని రెడీ చేసుకోవచ్చు.

బియ్యం పిండి.. కొరియన్ స్కిన్ కేర్‌లో రైస్, రైస్ ఫ్లోర్ చాలా ముఖ్యం. ఈ రైస్ పాడర్‌ని సరైన విధంగా రాస్తే స్కిన్ మెరుస్తుంది. బియ్యం పిండిలో అమినో యాసిడ్స్ ఉంటాయి. ఇవి చర్మంలో తేమని అలానే ్నంచుతుంది. బియ్యం పిండిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా స్కిన్ ఇన్ఫెక్షన్‌ని దూరం చేస్తుంది. అలాగే ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ కణాల డ్యామేజ్‌ని దూరం చేస్తాయి. ఇది ముడతలని తగ్గిస్తుంది.

పాలు.. పాలలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. పాలు మంచి హైడ్రేటర్. చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. చర్మం పొడిబారినట్లు అనిపిస్తే ముఖానికి పాలు రాయాలి. పాలలో యాంటీ ఆక్సిడెంట్స్ చర్మంపై ముడతలు, వయస్సు తాలుకూ మచ్చల్ని తగ్గిస్తాయి. పాలలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉన్నాయి. ఇది స్కిన్ ఇన్ఫెక్షన్స్‌ని దూరం చేస్తాయి. పాలలోని యాంటీ ఆక్సిడెంట్స్ సూర్యుని నుంచి వచ్చే హానికర యూవీ కిరణాల నుండి చర్మాన్ని కాపాడుకోవచ్చు. మొటిమలు వంటి చర్మ సమస్యల్ని దూరం చేస్తాయి.

మాస్క్ ఎలా చేయాలంటే.. ఈ మాస్క్ ఎలా చేయాలంటే ముందుగా గ్లాసు పాలు తీసుకోండి. ఫ్యాట్ మిల్క్ అయితే మంచిది. ఆ తర్వాత ఓ గిన్నెలో మూడు టీ స్పూన్ల బియ్యపిండి వేసి సరిపడా పాలు వేసి వేడి చేయాలి. ఇది చక్కగా క్రీమ్ అయ్యే వరకూ అలానే ఉంచండి. కలుపుతూనే ఉండాలి. అడుగంట కుండా చూసుకోండి. ఇప్పుడు ముఖాన్ని క్లీన్ చేసి ముఖానికి అప్లై చేయాలి. 15 నిమిషాల తర్వాత క్లీన్ చేయాలి. ఇలా చేయడం వల్ల మచ్చలు తగ్గి చర్మాన్ని గ్లాసీ స్కిన్ ఉండేలా చేస్తుంది. అయితే, మీకు ఏదైనా అలర్జీ ఉంటే ముందుగా స్కిన్ స్పెషలిస్ట్‌ని కలిసి సలహా అడగాలి. అదే విధంగా మీరు ప్యాచ్ టెస్ట్ చేశాకే ఈ ప్యాక్ ట్రై చేయడం మంచిది. మీకు ఓకే అనుకుంటే ప్యాక్ అప్లై చేసి క్లీన్ చేయండి.

పిల్లల్ని ఇలా చదివిస్తే ఫుల్ మార్కులొస్తాయి..



చాలా మంది పేరెంట్స్ పిల్లలు ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని ఆరాటపడతారు. అందుకోసం పిల్లల్ని ఇంట్లో చదివిస్తారు. ఇంట్లో పిల్లలు బాగా చదివినా పిల్లలకి పరీక్షల్లో ఎక్కువ మార్కులు రావు. దాంతో పిల్లలకి పరీక్షలంటే పెద్దలే ఎక్కువగా భయపడతారు. ఎగ్జామ్స్ డేట్ వచ్చినప్పట్నుంచి ఎగ్జామ్స్, రిజల్ట్ టైమ్ వరకూ వారు పడే టెన్షన్ అంత ఇంత కాదు. అలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే కచ్చితంగా పిల్లలు ఎగ్జామ్స్‌లో ఎక్కువ మార్కులు తెచ్చుకుంటారు.

క్రమశిక్షణ.. పిల్లలు మార్కులు తెచ్చుకోవాలంటే బాగా చదివితే సరిపోదు. పిల్లలకి క్రమశిక్షణ ఉండేలా చూసుకోవాలి. అది వారి బ్రెయిన్‌పై కూడా ఎఫెక్ట్ చూపిస్తుంది. దీని వల్ల వారి జ్ఞాపకశక్తిని మెరుగ్గా చేస్తుంది. అదే విధంగా, ప్రతి పనికి ఓ టైమ్పెట్టండి. చదవడానికి ఓ టైమ్, తినడానికి ఓ టైమ్ ఆడుకోవడం, నిద్రపోవడం, ఇలా ప్రతి పనికి ఓ పని పెట్టండి. దీని వల్ల వారు నేర్చుకున్న ప్రతి ఒక్క పనిని కచ్చితంగా గుర్తుపెట్టుకుంటారు.

గోల్.. పిల్లలకి చిన్నతనం నుంచి మంచి లక్ష్యాలు ఉండేలా చూసుకోండి. వారి అభిరుచి ఏంటో తెలుసుకుని వారు ఏమనుకోవాలనుకుంటున్నారో కనుక్కుని అందుకు తగ్గట్లుగా వారు ఎదిగేలా మీరు వారిని ట్రెయిన్ చేయండి. ఆయా రంగాల్లో ఎక్స్‌పర్ట్స్ గురించి చెప్పడం, వారి గోల్స్ రీచ్ అవ్వడానికి ఏమేం చేశారో తెలియజేయాలి. దీని వల్ల వారికి ముందు నుంచే సరైన అవగాహన ఉంటుంది

టైమ్.. టైమ్ కూడా చాలా ముఖ్యం. మనం ఎంత బాగా టైమ్‌ని వాడితే రిజల్ట్ అంత బావుంటుంది. అంతే కానీ, ఎక్కువసేపు చదివితే ఎక్కువగా మార్కులు వస్తాయని అనుకోవద్దు. కచ్చితంగా వారికి మధ్యమధ్యలో బ్రేక్ ఇవ్వాలి. వారికి కొంత సమయం చదవాలి. కొద్దిసేపు బ్రేక్ తీసుకోండని చెప్పండి. ఈ లోపు వారు ఏమేం చదువుకోవాలో ముందుగానే ఓ టైమ్‌ని ప్రిపేర్ చేసుకుంటారు...

మంచి వాతావరణం.. పిల్లలు మంచి ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా చూడండి. వారు చదువుకునేటప్పుడు ఎలాంటి శబ్దాలు, గొడవలు లేకుండా చూడండి. దీంతో వీరు ఏకాగ్రత కోల్పోకుండా చదువుకుంటారు. పిల్లలు చదివేటప్పుడు ఎక్కువ సౌండ్ లేకుండా చూడండి.

షార్ట్ కట్స్.. నేటి కాలంలో ఇంటర్నెట్‌లో షార్ట్‌కట్స్ గురించి చెబుతున్నారు. ఇది ముందుగా మీరు తెలుసుకుని ఈజీగా వారు అర్థమయ్యే విధంగా షార్ట్ కట్స్ ఉపయోగించేలా చూడండి. దీంతో వారు త్వరగా మర్చిపోరు. పరీక్షల్లో కూడా మార్కులు ఎక్కువగా వస్తాయి.

పెరుగులో కలిపి తింటే బెల్లీ ఫ్యాట్ తగ్గుతుందట..

పెరుగులో ఈ పొడి కలిపి తింటే బెల్లీ ఫ్యాట్, బరువు తగ్గుతుందట..

పెరుగు ఆరోగ్యానికి చాలా మంచిది. రెగ్యులర్‌గా వీటిని తినడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అయితే, పెరుగు తినడం వల్ల బెల్లీ ఫ్యాట్‌ని కూడా తగ్గించుకోవచ్చు. బరువు కూడా తగ్గుతారు. దానికోసం పెరుగులో జీలకర్ర కలిపి తింటే చాలా మంచి బెనిఫిట్స్ ఉంటాయని చెబుతున్నారు నిపుణులు. అసలు ఇది ఎలా పనిచేస్తుందో చూద్దాం.

పెరుగు, జీలకర్ర.. పెరుగు, జీలకర్రని ప్రతి ఒక్కరూ ఇళ్ళల్లో వాడతారు. ఇవి రెండూ ఆరోగ్యానికి మంచివే. పెరుగులో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ కొవ్వుని బరువు తగ్గడానికి చాలా మంచిది. జీలకర్రలో జీవక్రియలో బలంగా చేసి ఫ్యాట్‌ని తగ్గిస్తుంది. అందుకే జీలకర్ర నీరు తాగడం మంచిది. పెరుగు, జీలకర్రని కలిపితే అందులోని పోషకాలు రెంట్టింపు అవుతాయి. అందుకే కొద్దిగా పెరుగులో కొద్దిగా జీలకర్ర వేయాలి. దీనిని అలా అయినా వేయొచ్చు. లేదా పొడిలా చేసి వేయాలి. రెండు వేర్వేరు తినడం కంటే రెండింటిని కలిపి తింటే చాలా వరకూ బరువు తగ్గుతారని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అధ్యయనంలో తేలింది. పెరుగులో జీలకర్రని కలిపితే ఫ్యాట్ ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కొలెస్ట్రాల్‌ని పెంచే ట్రైగ్లిజరైడ్స్‌ని తగ్గించడంలో కూడా ఇది మంచిది. ఇది డయాబెటిస్‌ని తగ్గిస్తుంది. వీటి కారణంగానే బరువు పెరుగుతారు. కాబట్టి, పెరుగు జీలకర్ర వీటిని తగ్గిస్తాయి.

జీర్ణక్రియ.. ఈ రెండింటిని కలిపి తింటే జీర్ణ సమస్యలకు కూడా దూరమవుతాయి. పెరుగు మంచి బ్యాక్టీరియాని పెంచుతుంది. ఈ రెండూ గ్యాస్ అసిడిటీ సమస్యల నుంచి బయటపడేందుకు హెల్ప్ చేస్తాయి. పెరుగు జీర్ణమవ్వడానికి కొంత సమయం పడుతుంది. అందుకే రాత్రుళ్ళు పెరుగు తినకుండా ఉండడం మంచిదని ఆయుర్వేదం చెబుతుంది. అయితే, ఇందులో జీలకర్ర కలిపి తింటే త్వరగా జీర్ణమవుతుంది. ముఖ్యంగా జీలకర్ర పొడిని కలిపి తింటే మంచిది.

అదరగొట్టిన ఎస్బీఐ.. భారీగా పెరిగిన లాభాలు..

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యూ3 ఫలితాల్ని ప్రకటించింది. నికర లాభం ఏకంగా 84 శాతానికిపైగా పెరిగింది. ఆదాయం కూడా పెరిగింది. అయితే ఇదే సమయంలో ఎస్బీఐ మంచి ఫలితాలు నమోదు చేసినప్పటికీ.. స్టాక్ ధర మాత్రం పడిపోయింది. గత కొద్ది రోజులుగా కూడా ఈ షేర్ ధర పతనమైంది.

దేశంలోని దిగ్గజ కంపెనీలు వరుసగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికం ఫలితాల్ని ప్రకటిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. తొలుత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ కంపెనీలు ఫలితాల్ని వెల్లడించగా.. తర్వాత బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు

కూడా ఫలితాల్ని వెల్లడించాయి. తాజాగా దేశంలోని ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద బ్యాంక్.. ఎస్బీఐ కూడా అక్టోబర్–డిసెంబర్ క్వార్టర్ ఫలితాల్ని విడుదల చేసింది. క్యూ3లో ఈ బ్యాంకు నికర లాభం ఏకంగా 84.32 శాతం పెరిగి రూ. 16,891 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఈ సమయంలో లాభం కేవలం రూ. 9,164 కోట్లుగానే ఉండేది. దీంతో ఈసారి భారీగా పెరిగిందని చెప్పొచ్చు. ఈ లాభం.. అంచనాల్ని మించింది.

ఇక సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ. 41,446 కోట్లుగా వచ్చింది. ఏడాది కిందట ఇదే సమయంలో వడ్డీ ఆదాయం రూ. 39,816 కోట్లుగా ఉంది. మరోవైపు టాక్స్ తర్వాత లాభం రూ. 16,891 కోట్లుగా వచ్చింది. ఇక్కడ అంచనాల్ని తప్పినట్లు తెలుస్తోంది. ఇక బ్యాంకు.. ఉద్యోగులపై వెచ్చించే ఖర్చులు 17 శాతం తగ్గి రూ. 16,074 కోట్లకు చేరింది. ఎస్బీఐ డొమెస్టిక్ లోన్స్ 14.06 శాతం మేర పెరిగాయి. ఏడాది కిందటి నుంచి పోలిస్తే ఇలా ఉండగా.. కిందటి త్రైమాసికం అంటే జులై– సెప్టెంబర్ త్రైమాసికం ఫలితాలతో చూస్తే లాభం 8 శాతం తగ్గడం గమనార్హం. ఇక సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 10 శాతం పెరిగి రూ. 1.17 లక్షల కోట్లుగా ఉంది.

ఎస్బీఐ ఈ సమయంలో మంచి ఫలితాలే నమోదు చేసినప్పటికీ.. మరోవైపు స్టాక్ నెగెటివ్‌లో ట్రేడవుతోంది. కిందటి సెషన్లో రూ. 766.05 వద్ద ముగిసిన స్టాక్.. ఇవాళ ఆరంభంలో స్వల్ప లాభాల్లోనే ట్రేడయినప్పటికీ తర్వాత మార్కెట్లు నష్టపోతున్న క్రమంలో.. మరోవైపు ఫలితాల నేపథ్యంలో ఈ స్టాక్ పడిపోతూ వచ్చింది. ప్రస్తుతం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎస్బీఐ షేర్ ధర 1.75 శాతం నష్టంతో రూ. 752.65 వద్ద ఉంది. ఇంట్రాడేలో రూ. 751.05 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఇక స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 912 గా ఉంది. బ్యాంక్ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 6.72 లక్షల కోట్లుగా ఉంది. ఈ బ్యాంక్ స్టాక్.. గత5 రోజులు, నెల, 6 నెలల సమయంలో చూస్తే ప్రతికూల ఫలితాల్నే అందిస్తోంది. ఏడాదిలో మాత్రం 15 శాతం పెరగ్గా.. ఐదేళ్లలో చూస్తే 130 శాతానికిపైగా పుంజుకుంది.

బడ్జెట్ తర్వాత కూడా..
సుకన్య వంటి పథకాల్లో పెట్టుబడి పెట్టాలా?

2025: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2025లో ఆదాయపు పన్నులకు సంబంధించి సంచలన నిర్ణయం తీసుకుంది. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించింది. దీంతో కొత్త పన్ను విధానంలోకి మారతారు. యూనియన్ బడ్జెట్ 2025లో కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చారు. రూ.12 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించారు. ఈ నిర్ణయం మరింత మంది ట్యాక్స్ పేయర్లు పాత పన్ను విధానం నుంచి కొత్త పన్ను విధానంలోకి మారేందుకు ప్రోత్సహిస్తుంది. అయితే, పాత పన్ను విధానంలో ఉంటే వివిధ పన్ను మినహాయింపులు, డిడక్షన్లు కొత్త విధానంలో ఉండవు. అయినప్పటికీ రూ.12 లక్షల వరకు రిబేట్, స్టాండర్డ్ డిడక్షన్ కల్పించడం గమనార్హం. దీంతో 97 శాతం మంది ట్యాక్స్ పేయర్లు కొత్త విధానంలోకి మారే అవకాశం ఉందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్ ఇటీవలే వెల్లడించారు. సాధారణంగా సెక్షన్ 80సీ ద్వారా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి యోజన, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వంటి పెట్టుబడులపై రూ.1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. అలాగే సెక్షన్ 80డీ ద్వారా ఆరోగ్య బీమాపై గరిష్ఠంగా రూ.50 లక్షల మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీసీసీ ద్వారా పెన్షన్ ఫండ్ కంట్రిబ్యూషన్‌పై ట్యాక్స్ డిడక్షన్స్ ఉంటాయి. హెమ్ లోన్ వడ్డీ, హెచ్ఆర్ఏ మినహాయింపులు వంటివి పాత పన్ను విధానంలో ఉంటాయి. కానీ, కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. చిన్న మొత్తాల పొదుపు పథకాలైన పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, ఈఎల్ఎస్ఎస్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్న ట్యాక్స్ పేయర్లకు ఎలాంటి ప్రోత్సాహకాలు కల్పించే పాత పన్ను విధానంలో కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ స్కీమ్స్ అన్నీ సెక్షన్ 80సీ కిందకు వస్తాయి. రూ.1.50 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. 2020లో కొత్త పన్ను విధానం ప్రవేశపెట్టినప్పటి నుంచి చూసుకుంటే పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ, కొత్త విధానంలోకి మారిన వారికి ప్రతి ఏడాది భారీ ఊరట కల్పిస్తున్నారు. పన్ను శ్లాబుల్లో మార్పులు, ట్యాక్స్ మినహాయింపుల పెంపు వంటివి ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో బడ్జెట్ 2025 తర్వాత కూడా చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో పెట్టుబడులు కొనసాగించాలా? వద్దా? అనే విషయంపై చాలా మంది ట్యాక్స్ పేయర్లు ఆయోమయంలో పడ్డారు. చాలా మంది కొత్త పన్ను విధానంలోకి మారిన తర్వాత పెట్టుబడులు పెట్టడం మానేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఆర్థిక నిపుణులు పలు విషయాలు వెల్లడించారు. ట్యాక్స్ సేవింగ్ ప్రయోజనాలు లేనప్పటికీ ఆయా పథకాల్లో పెట్టుబడులు కొనసాగించాలని చెబుతున్నారు. ఈ పొదుపు పథకాలను ఎంచుకోవడం కేవలం పన్ను ఆదా కోసం మాత్రమే ఉండకూడదంటున్నారు. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ఇప్పటికీ సురక్షితమైన, స్థిరమైన రిటర్నులు అందిస్తాయని గుర్తు చేశారు.

బడ్జెట్ తర్వాత ట్యాక్స్ పేయర్లకు తమ పెట్టుబడి నిర్ణయాలపై మరింత సౌలభ్యం ఏర్పడిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ట్యాక్సే సేవింగ్ పథకాలే కాకుండా ఇతర పొదుపు పథకాలను ఎంచుకునేందుకు అవకాశం లభించిందని, తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడి పథకాలను ఎంచుకోవచ్చంటున్నారు. దీంతో ట్యాక్స్ సేవింగ్ స్కీమ్స్ ఈఎల్ఎస్ఎస్ వంటి మూడేళ్ల లాకిన్ పీరియడ్ లేదా 15 ఏళ్ల లాకిన్ పీరియడ్ ఉన్న పీపీఎఫ్ కాకుండా ఇతర పథకాలనూ ఎంచుకోవచ్చని చెబుతున్నారు. ఏదైనా ట్యాక్స్ బెనిఫిట్స్ కోసమే ఆలోచించకూడదని, ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుడులను కొనసాగించాలంటున్నారు.

నైపుణ్యం, వికేంద్రీకరణ, వ్యాపార సామర్థ్యాల
పెంపుపై దృష్టి పెట్టండి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్
ఘనంగా మూవ్ ఇన్ సింక్ జీసీసీ కాన్క్లేవ్ 2025

హైదరాబాద్, నైపుణ్యం, వికేంద్రీకరణ, వ్యాపార సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం (ఐ అండ్ సీ), సమా చార సాంకేతికత (ఐటీ) విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) వృద్ధి కోసం ప్రభుత్వంతో వ్యాపార ప్రముఖులు చర్చించేందుకు హైదరాబాద్‌లోని షెరటన్ హోటల్‌లో మూవ్ ఇన్ సింక్ జీసీసీ కాన్క్లేవ్ 2025 నిర్వహించారు. ఈ కాన్క్లేవ్ కు అధ్యక్షత వహించిన జయేశ్ మాట్లాడుతూ గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు ఆర్థిక వృద్ధికి మూలమ న్నారు. ఇవి మా ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైన వృద్ధి శక్తిగా మారాయన్నారు. ఇటీవల బడ్జెట్‌లో జాతీయ స్థాయిలో దీనిపై ఒక విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించామన్నారు. హైదరాబాద్ అన్ని వృద్ధి ప్రమాణాలలో దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. దీనికి గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల సహకారం ఎంతో ఉందని చెప్పారు. వికేంద్రీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామ న్నారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన టైర్–2 సిటీల పాలసీ ద్వారా హైదరాబాద్ వెలుపల కంపెనీలు ఏర్పాటు చేస్తే ప్రోత్సాహ కాలు అందిస్తున్నట్టు తెలిపారు. తూర్పు హైదరాబాద్‌లోని మేడ్చల్, దక్షిణ హైదరాబా ద్‌లోని మల్లంపేట ప్రాంతాలను ప్రస్తా విస్తూ..ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిం చారు. వ్యాపార సంస్థలు తమ ఉద్యోగులను ఈ ప్రాంతాల్లో ప్రణాళికబద్ధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ

సందర్భంగా మూవ్ ఇన్ సింక్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో దీపేశ్ అగర్వాల్ మాట్లాడుతూ 2030 నాటికి భారతీయ గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల మార్కెట్ 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. ఇప్పటికే 30 శాతం పైగా గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు ఇతర నగరాల కంటే హైదరాబా ద్‌ను ప్రాధాన్యతగా ఎంచుకున్నాయని తెలిపారు. హ్యూమనైజ్ వ్యవస్థాపకుడు, సీఈవో జగదీష్ మిత్ర మాట్లాడుతూ 2030 నాటికి 2,400 గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనున్నదని తెలిపారు. ఇప్పటికే గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు ముఖ్యమైన ఇన్నోవేషన్ హబ్‌గా మారింద న్నారు. హ్యూమనైజ్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో జగదీష్ మిత్ర, లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఇండియా సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ శిరీషా ఓరుగంటి మధ్య ఫైర్‌సైడ్ చాట్ జరిగింది. భారతదేశం లోని వ్యాపారాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజె న్స్ పాత్రపై చర్చించారు. ఈ చర్చలో ఎవర్నార్త్ హెల్త్ సర్వీసెస్ ఇండియా మేనేజిం గ్ డైరెక్టర్ అశోక్ వెంకటాచలం, జీసీసీ సైట్ లీడర్, కెన్వ్యూ సొల్యూషన్స్ ఇండియా జీసీసీ వీపీ, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ పునేయాని, కార్లెన్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రకాశ్ దేవరకొండ, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ వీపీ, మేనేజింగ్ డైరెక్టర్ హరికృష్ణ వర్మ నడింపల్లి, హ్యూమ నైజ్ సహ వ్యవస్థాపకుడు రాజారాయ్ పాల్గొన్నారు.

పనామా కాలువపై అమెరికాకు రాయితీ అంతా ఉత్తదే..

పనామా కాలువలో ప్రయాణించే అమెరికా నౌకలకు ఆ దేశం ఎలాంటి ఫీజు తీసుకోవడం లేదని చెబుతూ అగ్రరాజ్యం అమెరికా విదేశాంగ మంత్రి తాజాగా పోస్ట్ పెట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే అదేమీ లేదని.. తాను అమెరికాకు ఎలాంటి రాయితీ కల్పించలేదంటూ తాజాగా పనామా కెనాల్ అథారిటీ సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చింది. ముఖ్యంగా టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివి తమ పరిధిలోకే వస్తాయని.. ఇప్పటి వరకు తాము ఎలాంటి సవరణలు చేయలేదంటూ షాక్ ఇచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అగ్రరాజ్యం అమెరికాకు చెందిన యుద్ధ నౌకలు.. పనామా కాలువపై నుంచి ప్రయాణిస్తే ఎలాంటి ఫీజును తీసుకోమని ఆ దేశం చెప్పిందంటూ యూఎస్ తాజాగా ప్రకటించింది. ముఖ్యంగా అమెరికా రక్షణ మంత్రి హెగ్సే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలుపగా.. ఇదంతా నిజమేనంటూ అమెరికా విదేశాంగ కూడా ధ్రువీకరించింది. కానీ దీనిపై తాజాగా పనామా కెనాల్ అథారిటీ స్పందించింది. అలాంటిదేమీ లేదని.. తామేమీ అమెరికాకు రాయితీ కల్పించలేదని స్పష్టం

చేసింది. ముఖ్యంగా టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివి తమ పరిధిలోకే వస్తాయని.. ఇప్పటి వరకు తాము ఎలాంటి సవరణలు చేయలేదంటూ షాక్ ఇచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికా రక్షణ మంత్రి హెగ్సే ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ మరీ.. అమెరికా యుద్ధ నౌకలు పనామా కెనాల్‌పై ప్రయాణిస్తే ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని వివరించింది. ఇందుకు ఆ దేశం కూడా ఒప్పుకుందని వెల్లడించింది. ఇది నిజమేనంటూ అమెరికా విదేశాంగ శాఖ కూడా క్లారిటీ ఇవ్వగా.. అంతా నిజమేనని భావించారు. కానీ తాజాగా ఇదంతా అబద్ధం అని.. పనామా కెనాల్ అథారిటీ తేల్చి చెప్పింది. పనామా అమెరికాతో ఎలాంటి ఒప్పందమూ చేసుకోలేదని వివరించింది.

ముఖ్యంగా పనామా కెనాల్ నిర్వహణ బాధ్యత తమవద్దే ఉంటుందని.. టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివన్ని తమ పరిధిలోకే వస్తాయని వెల్లడించింది. ఇప్పటి వరకు తాము పనామా కాలువకు సంబంధించిన ఎలాంటి సవరణలు చేయలేదని.. ముఖ్యంగా యూఎస్‌కు ఎలాంటి రాయితీ కల్పించలేదని ప్రకటించింది. దీంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు అమెరికా ఇలా ఎందుకు చెప్పిందని ఆలోచిస్తున్నారు.

ప్రపంచ వాణిజ్యానికి ఎంతో కీలకం అయిన ఈ జల మార్గాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు ఎన్నో ఏళ్లుగా కలలు కంటుకున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడే ఈ విషయాన్ని తెలిపిన అతడు.. మరోసారి అధికారం చేతిలోకి రావడంతో కలను సాధించుకోవాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం 51 మైళ్లు (82 కిలో మీటర్లు) కల్గిన ఈ పనామా కాలువ అట్లాంటిక్–పసిఫిక్ సముద్రాల మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.

అయితే ఈవారంలోనే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో లాటిన్ అమెరిగా దేశాల్లో పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగానే కెనాల్‌పై చైనా నియంత్రణల్లో తక్షణమే మార్పులు తీసుకు రావాలని ఒత్తిడి చేయబోతున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఆ దేశం చర్యలు తీసుకోకపోతే తామే ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని కూడా అమెరికా భావిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే రూబియో పనామా అధ్యక్షుడు జాస్‌రౌల్‌తో పాటు కాలువ నిర్వాహకుడు రికార్టే వాస్క్వేజ్ మోరేల్స్‌ను కలిశారు.

అమెరికాలో కోడిగుడ్ల కొరత..

సాధారణంగా కోళ్లను దొంగిలించే వాళ్లను చూస్తూనే ఉంటాం. అయితే ఇప్పుడు అమెరికాలో మాత్రం కోడి గుడ్లను దొంగతనం చేశారు. అది కూడా ఒకటో రెండో గుడ్లు కాదు.. ఏకంగా లక్ష గుడ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. వినడానికి చాలా ఫన్నీగా ఉన్నా.. ఈ ఘటన నిజంగానే జరిగింది. ప్రస్తుతం అమెరికాలో గుడ్ల కొరత అక్కడి వారిని వేధిస్తుండగా.. కొందరు దాన్ని ఆసరాగా చేసుకుని.. లక్ష గుడ్లు చోరీ చేయడం తీవ్ర దుమారానికి కారణం అవుతోంది. అసలు అమెరికాలో గుడ్ల కొరత ఎందుకు వచ్చింది. ఈ దొంగతనం ఎలా జరిగింది అనేది ఈ స్టోరీలో చూద్దాం.

అమెరికాలో ప్రస్తుతం కోడి గుడ్ల కొరత నెలకొంది. కోడి గుడ్లను కొనుగోలు చేసేందుకు అమెరికన్లు భారీగా ఎగబడుతున్నారు. దీంతో కోడి గుడ్ల ధరలు అక్కడ అమాంతం పెరుగుతున్నాయి. అయితే ఉత్పత్తి తక్కువ కావడం.. డిమాండ్ పెరిగిపోవడంతో.. గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మరోవైపు.. బర్డ్ ఫ్లూ కారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపో యిందని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే గుడ్లు దొంగతనం జరగడం గమనార్హం. ఏకంగా 1 లక్ష గుడ్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు తాజాగా పోలీసులకు ఫిర్యాదు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కోడి గుడ్ల కొరత నెలకొనగా.. ఇప్పుడు ఏకంగా లక్ష గుడ్లు దొంగతనానికి గురి కావడం సంచలనంగా మారింది.

పెన్సిల్వేనియా రాష్ట్రంలోని గ్రీన్‌క్యాసెల్ నగరంలో ఉన్న పీట్ అండ్ గ్యారీస్ ఆర్గానిక్స్ ఎల్ఎల్‌సీ సంస్థకు చెందిన లక్ష గుడ్లు మాయం అయ్యాయి. రిటైల్ షాపులకు సరఫరా చేసేందుకు గుడ్లను లారీల్లో లోడ్ చేయగా.. ఆ లోడ్ నుంచి దొంగలు కోడి గుడ్లను ఎత్తుకెళ్లినట్లు సదరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. చోరీ అయిన గుడ్ల విలువ 40 వేల డాలర్లు అని.. అయితే ఇది మన భారత కరెన్సీలో దాదాపు రూ.35 లక్షలు ఉంటుందని తెలుస్తోంది.

గత కొన్ని రోజులుగా కోడి గుడ్ల కొరతతో అమెరికావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2 ఏళ్ల క్రితం డజన్ గుడ్లు ఒక డాలర్ అంటే మన కరెన్సీలో రూ.84 ఉండగా.. ఇప్పుడు అదే డజన్ గుడ్ల ధర ఏకంగా 7 డాలర్లు అంటే దాదాపు రూ.590 పలుకుతున్నట్లు చెబుతున్నారు. గుడ్ల కొరత కారణంగానే ఒక్కసారిగా వీటి ధర అమాంతం పెరిగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక అమెరికాలో గుడ్ల ధరలు పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి బర్డ్‌ఫ్లూ కాగా.. మరొకటి పెరుగుతున్న గుడ్ల డిమాండ్. గత 2 ఏళ్లుగా అమెరికాలోని పలు ప్రాంతాల్లో క్రమంగా బర్డ్‌ఫ్లూ ప్రభావం

పెరుగుతూ వస్తోంది. గత దశాబ్దకాలంలోనే ఇంతటి భారీ స్థాయిలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాపించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గతనెలలో లూసియానా రాష్ట్రంలో మనుషులకు కూడా ఈ ప్రాణాంతకరమైన స్థాయిలో ఉండే బర్డ్‌ఫ్లూ వేరియంట్‌ను డాక్టర్లు కనుగొన్నారు. దీంతో పౌల్ట్రీ యజమానులు.. ప్రతి నెలా లక్షలాది కోళ్లను చంపేస్తున్నారు. 2022లో బర్డ్ ఫ్లూ కారణంగా 10.4 కోట్ల గుడ్లు పెట్టే కోళ్లు చనిపోయాయని యునైటెడ్ ఎగ్ ప్రొడ్యూసర్స్ వెల్లడించింది. ఇవే కాకుండా గతేడాది అక్టోబర్‌లో 29 లక్షల కోళ్లు చనిపోయాయని.. ఈ కారణంగానే అమెరికాలో ప్రస్తుతం గుడ్ల కొరత ఏర్పడినట్లు చెబుతున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ తినలేని అమెరికన్లు మొత్తం.. ఇప్పుడు గుడ్లు తినడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని.. అందుకే గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. గుడ్ల ధరలు భారీగా పెరుగుతుండటంతో గుడ్లతో తయారు చేసే వంటకాల ధరలను కూడా రెస్టారెంట్లు, హోటళ్లు పెంచుతున్నాయి.

అమెరికాలో ప్రస్తుతం కోడి గుడ్ల కొరత నెలకొంది. కోడి గుడ్లను కొనుగోలు చేసేందుకు అమెరికన్లు భారీగా ఎగబడుతున్నారు. దీంతో కోడి గుడ్ల ధరలు అక్కడ అమాంతం పెరుగుతున్నాయి. అయితే ఉత్పత్తి తక్కువ కావడం.. డిమాండ్ పెరిగిపోవడంతో.. గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మరోవైపు.. బర్డ్ ఫ్లూ కారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయిందని అధికారులు వెల్లడించారు.

భారత్‌తో సంప్రదింపులపై పాక్ ప్రధాని సన్నాయినొక్కులు!

దేశ విభజన జరిగిన 75 ఏళ్లు గడిచినా.. ఇప్పటికీ కశ్మీర్ అంశం రగులుతూనే ఉంది. దాయాది పాకిస్థాన్.. ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించి భారత్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఈ కుట్రలను భారత్ తిప్పికొడుతూ.. పాక్ తీరును ఐరాస వంటి వేదికలపై ఎండగడుతోంది. కశ్మీర్‌లో అంగుళం భూమి కూడా వదులుకోబోమని... అది ఎప్పటికీ మా దేశంలో అంతర్భాగమేనని భారత్ కుండ బద్దలు కొడుతోంది. ఇందులో ఇతరుల జోక్యాన్ని సహించబోమని చెప్పింది. దాయాది పాకిస్థాన్ మరోసారి శాంతి మంత్రం వల్లించింది. కశ్మీర్ అంశం సహా భారత్‌తో ఉన్న అన్ని సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకో వాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. కానీ, ఐక్యరాజ్యసమితిలో చేసిన వాగ్దానాలను భారత్ నెరవేర్చి, చర్చలకు ముందుకు రావాలంటూ పసన్నాయి నొక్కులు నొక్కింది. 'కశ్మీర్ సంఘీభావ దినం' సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఆగస్టు 5 నాటి ఆలోచన నుంచి భారత్ బయటకు రావాలని కోరారు. అయితే, ఐరాసకు చేసిన వాగ్దానం నేరవేర్చుతూ కశ్మీర్ సహా అన్ని సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని షెహబాజ్ అన్నారు. పరోక్షంగా భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దును పాక్ ప్రధాని ప్రస్తావించడం గమనార్హం. 'కశ్మీరీలకు స్వయం నిర్ణయాధికార హక్కు లభించే వరకు పాకిస్థాన్ దృఢమైన నైతిక, దౌత్య, రాజకీయ మద్దతును అందిస్తూనే ఉంటుంది' అని ఆయన అన్నారు, 'కశ్మీర్ సమస్యకు ఏకైక పరిష్కారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం ప్రకారం స్వయం నిర్ణయాధికార హక్కు మాత్రమే' అని కూడా ఆయన తెలిపారు.

రెండు పౌర విమానాలు ఢీ..

అగ్రరాజ్యం అమెరికాలో వరుసగా విమాన ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవలే మూడు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలు ప్రజలు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో ప్రమాదం జరిగింది. సియాటెల్–టకోమా విమానాశ్రయంలో రెండు పౌర విమానాలు ఢీకొనగా.. అదృష్ట వశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టమూ సంభవించలేదు. కాకపోతే ఇందుకు సంబంధించిన వీడియో మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతుంది. అలాగే ప్రమాద సమయంలో రెండు విమానాల్లోనే పెద్ద ఎత్తున ప్రయాణికులు ఉండగా.. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈమధ్య కాలంలో అగ్రరాజ్యం అమెరికాలో వరుసగా విమాన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవలే మూడు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రెండు పౌర విమానాలు ఢీకొన్నాయి. విమానాశ్రయంలోనే ఈ ప్రమాదం సంభవించగా.. ఆ సమయంలో రెండు విమానాల్లోనూ పెద్ద ఎత్తునే ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది. అమెరికా వాషింగ్టన్‌లోని సియాటెల్ నగరంలో తాజాగా మరో విమాన ప్రమాదం జరిగింది. సియాటెల్–టకోమా అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం రోజు ఉదయం 10.17 గంటల సమయంలో డెల్టా ఎయిర్ లైన్స్, జపాన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానాలు ప్రమాద వశాత్తు ఢీకొన్నాయి. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 విమానం 142 మంది ప్రయాణికులతో సియాటెల్ నుంచి మెక్సికోలోని పూర్టో వర్లర్టాకు వెళ్లాల్సి ఉండగా రన్‌వేపై సిద్ధంగా ఉంది.

అదే సమయంలో జపాన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం 172 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బందితో జపాన్‌లోని నరిటా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వచ్చి సియాటెల్‌లో ల్యాండ్ అయింది. ఈక్రమంలోనే టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న డెల్టా ఎయిర్ లైన్స్ విమానం తోక భాగాన్ని జపాన్ విమానం రెక్కలతో ఢీకొట్టింది. ప్రమాద విషయం గుర్తించిన రెండు విమానాల్లోని సిబ్బంది వెంటనే.. సదరు విమానాల నుంచి ప్రయాణికులను కిందకు దింపేశారు. అదృష్టవశాత్తు ఎలాంటి ఘోర ప్రమాదమూ జరగలేదు.

బుర్ర తక్కువై.. హనుమాన్ వదులుకున్నా

నటి ఫరియా అబ్దుల్లా వ్యాఖ్యలు బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం మే 1 విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది. ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని తన కెరీర్‌కు కొత్త

యశ్ టాక్సిక్ విడుదల మరోమారు వాయిదా

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం టాక్సిక్ మరోసారి వాయిదా పడింది. విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేసిన మేకర్స్, తర్వాత జూన్ 4కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం లేదని యష్ స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగపూరితమైన ప్రకటన విడుదల చేశారు. సినిమా కాన్ ఈవెంట్‌లో 'టాక్సిక్'కు వచ్చిన అంతర్జాతీయ స్పందనతో తమ బాధ్యత మరింత పెరిగిందని యష్ తెలిపారు. భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేలా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, ప్రస్తుతం గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై పని జరుగుతోందని వెల్లడించారు. అందుకే త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఇక ఈ వాయిదా వెనుక మరికొన్ని కారణాలు కూడా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఓటీటీ హక్కులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఒక ప్రముఖ సంస్థ రూ.110 కోట్లు ఆఫర్ చేయగా, నిర్మాతలు మాత్రం కనీసం రూ.250 కోట్లు ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ డీల్ ఇంకా ఖరారు కాకపోవడం కూడా ఆలస్యానికి కారణమైందని తెలుస్తోంది. అలాగే కొన్ని ప్యాచ్ వర్క్ పనులు ఇంకా పూర్తికాకపోవడం, సెన్సార్ పక్రియ ప్రారంభం కాకపోవడం కూడా వాయిదాకు దారితీసిన అంశాలుగా చెబుతున్నారు. అంతేకాకుండా పశ్చిమాసియాలో ఉన్న అనిశ్చిత పరిస్థితులు గ్లోబల్ రిలీజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో మేకర్స్ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రస్తుతం ఇతర ప్రాజెక్టుల పనుల్లో బిజీగా ఉండటంతో, పూర్తి స్థాయిలో ప్రమోషన్లపై దృష్టి సారించేందుకు సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పాత్ర కోసం రిస్క్‌కు వెనకాడని రష్మిక

పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయిందని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వారణాసికి ప్రపంచ మార్కెట్

పక్కా ప్రణాళికతో చిత్ర బృందం అడుగులుఅగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన సినిమాలతో పాన్ ఇండియా సహా... మరెన్నో సరికొత్త మార్కెట్లకి దారి వేశారు. ఆ దారి తెలుగు సినిమాలకు గత కొన్నేళ్లుగా రాచబాటగా మారింది. 'బాహుబలి' సినిమాల తర్వాత జపాన్ సహా ఎన్నో దేశాల్లో తెలుగు సినిమాలపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అదే తరహాలో మరిన్న దేశాల్లో వారణాసిని తీసుకెళ్లేలా దర్శకుడు రాజమౌళి ప్లాన్ వేస్తున్నారు. మార్కెట్‌ను పెంచుకోవడం లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నారు. వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని ఆ చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాల్లో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలతో 'వారణాసి' బృందం ఉంది. అందులో భాగంగానే ఇటీవల మెక్సికోలో జరిగిన కామిక్ కాన్‌లో సినిమాని ప్రచారం చేశారు.

బన్సాలీ సినిమాలో రామ్‌చరణ్ బదులు..ధనుష్



ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తన సినిమాల ద్వారా విజువల్ గ్రాండియర్‌కు కొత్త అర్థం తీసుకొచ్చిన వ్యక్తిగా పేరు పొందారు. ఆయన తెరకెక్కించే ప్రతి చిత్రం విజువల్ వండర్‌గా నిలుస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ నేపథ్యంలో భన్సాలీ ప్రొడక్షన్స్ నుంచి రాబోతున్న మరో భారీ ప్రాజెక్ట్ ఇప్పుడు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ బ్జడెట్‌తో రూపొందనున్న ఈ మైథోలాజికల్ జంగిల్ డ్రామాను పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాతో మిత్రన్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. అడవి నేపథ్యంలో సాగే పౌరాణిక గాథను అత్యాధునిక సాంకేతికతతో, భన్సాలీ స్టైల్ గ్రాండియర్‌తో తెరకెక్కించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం మొదట మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పేరును పరిశీలించినట్లు సమాచారం. ఈ పాత్రకు ఆయన సరిపోతారని భావించినప్పటికీ, పలు కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ఆయన చేతిలోకి రాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అవకాశం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌ని వరించిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ధనుష్ తన విభిన్నమైన పాత్రల ఎంపికతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ వస్తున్నాడు. ప్రత్యేకంగా కంటెంట్ ఆధారిత సినిమాల్లో తనదైన ముద్ర వేసిన ఆయనకు ఈ మైథోలాజికల్ పాత్ర మరో మైలురాయిగా నిలిచే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పాత్రకు అవసరమైన నటన, యాక్షన్, భావోద్వేగాలను సమర్థంగా ప్రదర్శించగల సామర్థ్యం ధనుష్‌లో ఉందనే నమ్మకంతోనే భన్సాలీ టీమ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాక్. ఈ సినిమా కథాంశం పురాణ కాలం నేపథ్యంలో అడవిలో జరిగే సంఘటనల చుట్టూ తిరుగుతుందని సమాచారం. గ్రాండియర్ విజువల్స్, శక్తివంతమైన కథనం, సాంకేతిక నైపుణ్యంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రామ్ చరణ్ నుంచి ధనుష్ చేతికి వెళ్లిన ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇటు దక్షిణాది, అటు బాలీవుడ్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తుండగా, ఈ మైథోలాజికల్ జంగిల్ డ్రామా ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

నెట్‌ఫ్లిక్స్‌కు ఫిక్సయిన డెకాయిట్

టాలీవుడ్ యువ కథానాయకుడు అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ కలిసి నటించిన యాక్షన్ ప్రేమకథ డెకాయిట్ ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం మంచి వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. విడుదలై మూడు వారాలు దాటినా కూడా వారాంతాల్లో గట్టి కలెక్షన్స్ రావడం ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధిస్తుందనేది తెలియజేస్తుంది. ఈ విజయానికి ప్రధాన కారణం హీరో అడివి శేష్ సహజ నటన, మృణాల్ ఠాకూర్ అభినయం. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం సినిమా భావోద్వేగాలను మరింత ఎలివేట్ చేసింది. కథలో యాక్షన్, ఎమోషన్, ప్రేమ వంటి అంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఇప్పుడు ఇదే చిత్రం ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా అప్‌డేట్స్ ప్రకారం, మే 8 నుంచి దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, డిజిటల్ రిలీజ్ దాదాపు ఖరారైనట్టే తెలుస్తోంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు, లేదా మరోసారి ఈ యాక్షన్ ప్రేమకథను ఆస్వాదించాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.